ఈనాడు
అమరావతి
గుంటూరు
శుక్రవారం అక్టోబరు 4, 2024





త్రిపుర సుందరి.. త్రిలోక పావని..

అమ్మ వారి ఉత్సవ విగ్రహాన్ని తెస్తున్న సీపీ రాజశేఖరబాబు, దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ, ఈవో రామారావు

ఈనాడు, ఈనాడు డిజిటల్ - అమరావతి

- తొలిరోజు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనం
- వేలాదిగా తరలివచ్చి దర్శించుకున్న భక్తజనం
- దుర్గమ్మకు స్వర్ణ కిరీటం అందజేసిన భక్తుడు

ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం నుంచి అంగరంగ వైభవంగా ఆరంభమయ్యాయి. తొలి రోజు ఉదయం 9 గంటల నుంచి అమ్మ వారి దర్శనానికి భక్తులను అనుమతించారు. దుర్గమ్మ బాలాత్రిపుర సుందరి దేవిగా దర్శనం ఇచ్చింది. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకుంటే పూర్వ ఫలం దక్కుతుందనేది భక్తుల ప్రగాఢ విశ్వాసం. అందుకే ఉదయం నుంచి వేలాదిగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.


శ్రీచక్ర నవావరణార్చన..

తొలిరోజు ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకూ 70 వేల మందికి పైగా భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. దుర్గమ్మకు ఓ అజ్ఞాత భక్తుడు రూ.2.50 కోట్ల విలువైన వజ్రాలు పొదిగిన బంగారు కిరీటం, ఆభరణాలను తొలిరోజు అందజేశారు. బాలా త్రిపుర సుందరీదేవిని మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, వంగలపూడి అనిత, కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు సుజనాచౌదరి, కామినేని శ్రీనివాస్, దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ తరలివచ్చి దర్శించుకున్నారు. భక్తులకు ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన పర్యవేక్షించారు.


వందే.. మంగళకారిణీ..

నేడు గాయత్రీదేవి రూపం..

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారు శ్రీగాయత్రీదేవి రూపంలో భక్తులకు దర్శనం ఇవ్వనుంది.
దర్శన వేళలు: ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు


దండాలు.. దండాలు.. అమ్మోరు తల్లీ
దుర్గమ్మా శరణు..


క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు



ఆలస్యం ఖరీదు..

రూ. 176 కోట్లు

- అమాంతం పెరిగిన గుంటూరు వాహిని విస్తరణ వ్యయం
- వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం ఫలితం

ఈనాడు-అమరావతి

గుంటూరు వాహిని ఆధునికీకరణకు గత తెదేపా ప్రభుత్వ హయాంలో 2019లో రూ. 378 కోట్లను మంజూరు చేసింది. టెండర్లు పిలిచి గుత్తేదారుతో ఒప్పందం చేసుకునే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో ప్రక్రియ ఆగిపోయింది. వైకాపా అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు పట్టాలెక్కలేదు. రైతులు, ప్రజాప్రతినిధుల నుంచి ప్రభుత్వంపై ఒత్తిడి వచ్చినా పనులు ముందుకు సాగలేదు. దీంతో వైకాపా పాలనలో ఐదేళ్లపాటు ప్రాజెక్టు మూలన పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు వాహిని విస్తరణ పనులపై కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సమీక్షించి ప్రస్తుత ధరలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జలవనరులశాఖ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ప్రాథమికంగా అంచనాలు సిద్ధం చేయగా రూ. 554 కోట్లకు అంచనాలు పెరిగాయి. సకాలంలో పనులు ప్రారంభించి పూర్తి చేసినట్లయితే రూ. 378 కోట్లతోనే కాలువ విస్తరణ పూర్తయ్యేది. రైతులకు ఉపయోగపడటంతోపాటు ప్రభుత్వానికి అదనపు భారం తప్పేది. ఇందుకు భిన్నంగా ఆలస్యం చేయడం వల్ల రూ. 176 కోట్ల అంచనా వ్యయం అదనంగా పెరిగింది.

దశాబ్దాల కల

గుంటూరు వాహిని మరో 30 కిలోమీటర్లు పొడిగించి మరింత ఆయకట్టుకు నీరు అందించాలన్నది దశాబ్దాల డిమాండ్. గత తెదేపా ప్రభుత్వం పొడిగింపు, విస్తరణకు వేర్వేరుగా టెండర్లు పిలిచి, పొడిగింపు పనులు గుత్తేదారుకు అప్పగించింది. విస్తరణ పనుల టెండర్ల ప్రక్రియ దశలో 2019 ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లు పట్టించుకోకుండా పక్కన పడేసింది. కూటమి ప్రభుత్వం గుంటూరు వాహిని విస్తరణ పొడిగింపు పనులు పూర్తిచేస్తామని ప్రకటించింది. తాజా ధరలకు అనుగుణంగా అంచనాలు తయారుచేయాలని అధికారులను ఆదేశించింది.

కాలువ సామర్థ్యం పెంపు

కాలువ ప్రారంభంలో 600 క్యూసెక్కుల నుంచి 750 క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతూ గొలపాడు వద్దకు 350 క్యూసెక్కుల నీరు తీసుకెళ్లాలనేది ప్రణాళిక. ఇరువైపులా గోడలు నిర్మించడం ద్వారా నీటివృథాకు అడ్డుకట్ట వేస్తారు. కాలువ వెడల్పు 18 మీటర్లకు విస్తరిస్తారు. ఇప్పటికే ఉన్న ఆయకట్టుకు 27వేల ఎకరాల స్థిరీకరణ, 33 గ్రామాల తాగునీటి అవసరాలు తీరనున్నాయి. గుంటూరు వాహిని 47వ కిలోమీటరు నుంచి 76.40 కిలోమీటర్లు వరకు పొడిగిస్తారు. దీనివల్ల బాపట్ల జిల్లాలో కొంత ఆయకట్టుకు నీరందుతుంది.

టెట్‌కు 88.42 శాతం హాజరు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) గురువారం నుంచి ఆన్‌లైన్ విధానంలో ప్రారంభమైంది. జిల్లా వ్యాప్తంగా రెండు సెషన్లలో జరిగిన పరీక్షకు 88.42 శాతం మంది అభ్యర్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు. నల్లపాడు బాలాజీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, కొర్నెపాడులోని ప్రియదర్శిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్‌లో పరీక్ష జరగ్గా ఉదయం సెషన్‌లో 525 మంది అభ్యర్థులకుగాను 68 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 520 మందికిగాను 53 మంది గైర్హాజరయ్యారు.


నల్లపాడు కేంద్రంలో టెట్‌కు హాజరయ్యేందుకు వెళ్తున్న అభ్యర్థినులు

నందిగం సురేష్‌తో సెల్ఫీలు

- పట్టించుకోని పోలీసులు
- ఉన్నతాధికారుల ఆగ్రహం

ఈనాడు, అమరావతి: మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి జరిగిన కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న వైకాపాకు చెందిన బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను గురువారం మంగళగిరి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కోర్టు వద్ద కొంతమంది ఆయన్ను కలిసి కరచాలనం చేయటం.. సెల్ఫీలు దిగినా పోలీసులు అభ్యంతరం చెప్పలేదు. దీనిపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రిమాండ్‌లో ఉన్న వ్యక్తితో బయట వ్యక్తులు సెల్ఫీలు ఎలా దిగుతారు? అంతమంది వచ్చి కలుస్తుంటే ఎస్కార్టు పోలీసులు ఏం చేస్తున్నారు? వారంతా కోర్టులోకి రాకుండా ఆ సమయంలో అక్కడ ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలి కదా? ఈ విషయంలో ఎందుకు నిర్లక్ష్యంగా ఉన్నారని మంగళగిరి పోలీసులను ప్రశ్నించినట్లు తెలిసింది. దీనికి బాధ్యులైన ఒకరిద్దరు పోలీసు అధికారులకు మోమోలిచ్చి వివరణ కోరే అవకాశం ఉందని పోలీసు వర్గాల ద్వారా తెలిసింది.

దసరా ఉత్సవాల రోజుల్లో..
గుంటూరు నుంచి విజయవాడ వైపు లారీలకు అనుమతి లేదు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: దసరా సందర్భంగా విజయవాడలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్న క్రమంలో ఉత్సవాలు ముగిసే వరకు గుంటూరు నుంచి విజయవాడ వైపునకు వెళ్లే చిన్న, పెద్ద లారీలకు అనుమతిలేదని ఎస్పీ సతీష్‌కుమార్ గురువారం తెలిపారు. గుంటూరు నుంచి విజయవాడ వైపుగా హైదరాబాద్‌కు వెళ్లే లారీలు పేరేచర్ల జంక్షన్ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా, గుంటూరు నుంచి విశాఖపట్నం వైపునకు బుడంపాడు జంక్షన్ వద్ద నుంచి తెనాలి, వేమూరు, కొల్లూరు, పెనుముడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామూరు, గుడివాడ, హనుమాన్‌జంక్షన్ మీదుగా వెళ్లాలని పేర్కొన్నారు. చిలకలూరిపేట వైపు నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లే లారీలు గుంటూరు-చిలకలూరిపేట వైజంక్షన్, చుట్టుగుంట, పేరేచర్ల, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదగ ప్రయాణించాలని కోరారు.

పనుల్లో నాణ్యత ఏది?

- మన ఇళ్లలో ఇలానే చేస్తామా?
- అధికారులను నిలదీసిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని


ఆర్‌యూబీలో నీళ్లు కారుతుండడంపై ప్రశ్నిస్తున్న పెమ్మసాని, పక్కన నసీర్, మాధవి తదితరులు

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: గుంటూరు రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనుల్లో నాణ్యత, ప్రమాణాలు పాటించకపోవడంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్, గల్లా మాధవితో కలిసి గురువారం స్టేషన్‌ను పరిశీలించారు. ఆర్‌యూబీలో నీళ్లు వస్తుండడంతో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై అధికారులను ప్రశ్నించారు. అదేవిధంగా పశ్చిమ వైపు కొత్తగా నిర్మించిన ప్లాట్‌ఫాంపై టైల్స్ లేచిపోవడంపై సంబంధిత అధికారులను అడిగారు. వర్షాకాలంలో ఆర్‌యూబీలోకి నీళ్లు వస్తున్నాయని, పనులు ఇంకా జరుగుతున్నందున ట్రాక్టర్లు రావడంతో టైల్స్ పాడయ్యాయని అధికారులు ఇచ్చిన సమాధానంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. మన ఇంట్లో ప్రతి వర్షాకాలం నీరు వస్తుంటే చూస్తూ ఊరుకుంటామా? అంటూ నిలదీశారు. పనులు పూర్తి కాకముందే టైల్స్ ఎందుకు వేయాల్సి వచ్చిందని అడిగారు. కేంద్రం నుంచి రూ. కోట్లు నిధులు మంజూరవుతున్నప్పటికీ పనుల్లో నాణ్యత కనిపించడంలేదన్నారు. దీనికి బాధ్యులను గుర్తించాల్సిందేనన్నారు. ప్రయాణికులకు మౌలిక సదుపాయాల కల్పనకు కేటాయిస్తున్న నిధులతో చేపట్టే పనులు సక్రమంగా లేకపోతే ఇంజినీర్ల పర్యవేక్షణ ఎందుకు ఉండడంలేదన్నారు. ఇక నుంచి ప్రతి నెలా రైల్వే పనుల పురోగతి, నాణ్యతపై సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు.

రైల్వే ప్రాజెక్టుల పురోగతి పరిశీలన

అనంతరం మంత్రి పెమ్మసాని మీడియాతో మాట్లాడుతూ రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై పరిశీలించేందుకు స్టేషన్‌కు వచ్చినట్లు తెలిపారు. ప్రయాణికుల అవసరాలను గుర్తించి అవసరమైన పనులు చేపట్టేందుకు నివేదికలు తయారుచేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఇందుకు అవసరమయ్యే నిధులను కేంద్రం నుంచి రాబట్టేవిధంగా తాను కృషి చేస్తానని తెలిపారు. గుంటూరు రైల్వే స్టేషన్‌ను మరింతగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ప్రణాళికలు రూపొందించి అమలయ్యేలా చూస్తానన్నారు. నగరంలో ట్రాఫిక్ కష్టాలను తీర్చేందుకు అవసరమైన చోట్ల ఆర్‌యూబీలను నిర్మించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు. సర్వజనాసుపత్రి ప్రధాన గేటు ఎదురుగా రైల్వే గేటు ఉన్నందున ట్రాఫిక్‌కు తరచుగా అంతరాయం ఏర్పడుతుందని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ తెలిపారు. సమావేశంలో మండల రైల్వే అధికారి రామకృష్ణ, గతిశక్తి సీపీఎం మనోహర్‌రెడ్డి, సీనియర్ డీఈఎన్(కోఆర్డినేషన్) అనూష, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అమరావతి పరిధిలో 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలు

- 3 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అనుబంధంగా..
- తక్షణం అమల్లోకి వచ్చేలా ఉత్తర్వులు

ఈనాడు-అమరావతి: రాజధాని అమరావతి పరిధిలో 3 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు అనుబంధంగా 9 రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటవుతున్నాయి. భూ సమీకరణలో భూములిచ్చిన రైతులకు సీఆర్‌డీఏ తిరిగి ఇచ్చే స్థలాల రిజిస్ట్రేషన్‌లు మాత్రమే వీటిల్లో జరుగుతాయి. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వులు వెంటనే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రతిరోజూ ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు ఈ రిజిస్ట్రేషన్ కేంద్రాలు పనిచేస్తాయి. కార్డు సెంట్రల్ ఆర్కిటెక్చర్ (సీసీఏ) సాఫ్ట్‌వేర్ ద్వారా రిజిస్ట్రేషన్‌లు జరగనున్నాయి. ప్రతి రిజిస్ట్రేషన్ కేంద్రంలో సీనియర్ అసిస్టెంట్‌ను డిప్యుటేషన్‌పై నియమిస్తారు. ప్రతి కేంద్రంలో ఇద్దరు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఇద్దరు సబార్డినేట్లు ఉంటారు. ఈ కేంద్రాల్లో నియమించే వారికి శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. ప్రభుత్వం నిర్ణయించిన తేదీ నుంచి ఇక్కడ రిజిస్ట్రేషన్‌లు మొదలవుతాయి. గత తెదేపా ప్రభుత్వ హయాంలోనూ ఇలాంటి రిజిస్ట్రేషన్ కేంద్రాలు పనిచేశాయి. రైతుల రిజిస్ట్రేషన్ అవసరాలు అనుసరించి అనుబంధ రిజిస్ట్రేషన్ కేంద్రాలను ఎంపికచేశారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	అనుబంధ రిజిస్ట్రేషన్ కేంద్రం	గ్రామాలు
మంగళగిరి	నవులూరు	నవులూరు, బెత్తపూడి, ఎర్రబాలెం
మంగళగిరి	కురగల్లు	కురగల్లు, నీరుకొండ
మంగళగిరి	నిడమర్రు	నిడమర్రు
తాడేపల్లి	ఉండవల్లి	ఉండవల్లి
తాడేపల్లి	పెనుమాక	పెనుమాక
తుళ్లూరు	రాయపూడి	రాయపూడి, కొండమరాజుపాలెం
తుళ్లూరు	ఉద్దండరాయునిపాలెం	ఉద్దండరాయునిపాలెం, లింగపాలెం, మల్కాపురం
తుళ్లూరు	వెలగపూడి	వెలగపూడి
తుళ్లూరు	వెంకటపాలెం	వెంకటపాలెం

ఆపద్బాంధవి.. ఎయిమ్స్

- 19.32 లక్షల మందికి ఓపీ సేవలు
- యూజర్ ఛార్జీ ఒకసారి చెల్లిస్తే చాలు

ఈనాడు - అమరావతి

సుమారు ఐదేళ్ల క్రితం మంగళగిరిలో పురుడు పోసుకున్న ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఇప్పటిదాకా 19.32 లక్షలమంది పొరుగు సేవల రోగులకు (ఓపీడీ) సేవలందించింది. నిష్ణాతులైన వైద్య బృందం, పారా మెడికల్ సిబ్బంది ఉండడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రోగులు ఇక్కడికి వస్తున్నారు. ఇక్కడ దాదాపుగా అన్ని వైద్యసేవలు అందుబాటులోకొచ్చాయి. బోధన, శిక్షణ, పరిశోధనలే ప్రామాణికంగా ఉండే ఎయిమ్స్ నాణ్యమైన వైద్యసేవలకు ప్రసిద్ధి. వీటితోపాటు రక్త పరీక్షలు, ఎక్స్‌రేలు ఇలా.. ప్రతీదీ ఇక్కడ ఉచితమే. మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సను ఉచితంగానే చేస్తున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ. లక్షలు వెచ్చించినా అసలు రోగ నిర్ధారణే కానివారు ఇక్కడికొచ్చి వైద్యం చేయించుకున్న ఉదంతాలెన్నో.



ఎయిమ్స్‌లో వైద్యసేవల వివరాలు

విభాగం	రోగులు
అవుట్‌పేషెంట్లు	19,32,329
ఇన్‌పేషెంట్లు	33,495
ఎమర్జెన్సీ	24,682
మేజర్ శస్త్రచికిత్సలు	11,197
చిన్న శస్త్రచికిత్సలు	27,715
ప్రసవాలు	964
డయాలసిస్	5,172
ల్యాబ్, రేడియాలజీ పరీక్షలు	30,25,509

☛ ఇటీవల విజయవాడకు చెందిన శ్రీరాం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన కె. గౌరీప్రసాద్ మూత్రపిండ సమస్యలతో అనేక ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్నారు. భారీగా ఖర్చు పెట్టారు. కానీ.. రోగం నయం కాలేదు. వీరిద్దరూ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లే. చివరకు ఎయిమ్స్‌లో చేరారు. వారి తల్లుల నుంచి వైద్యులు కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు చేశారు. ప్రస్తుతం వారిద్దరూ కోలుకుంటున్నారు.

☛ పర్చూరుకు చెందిన పదో తరగతి విద్యార్థికి గుండెపోటు వచ్చింది. పరిస్థితి విషమించడంతో వైద్యుల బృందం 20 నిమిషాలపాటు సీపీఆర్ చేయగా.. గుండెలో కదలిక వచ్చింది. అనంతరం శస్త్రచికిత్స చేసి విద్యార్థి ప్రాణాలు కాపాడడంతో ఆ తల్లి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మొత్తం పడకలు 960

☛ రాజమహేంద్రవరానికి చెందిన డ్రైవర్ మోకాలు పైభాగంలో కేన్సర్ కణాలు రావటంతో నడవలేక ఇబ్బంది పడ్డారు. చికిత్సకు రూ. 10 లక్షలు ఖర్చవుతుందని ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు చెప్పగా ఎయిమ్స్‌లో చేరారు. ఆ కణాలను తొలగించిన ఇక్కడి వైద్యులు బయాప్సీకి సైతం ముంబయి పంపారు. వైద్యం విషయంలో రాజీ పడకుండా సేవలు అందిస్తున్నారు.

☛ కిడ్నీ మార్పిడికి కుటుంబ సభ్యులు ముందుకొస్తేనే వెంటనే శస్త్రచికిత్స చేస్తామని నెఫ్రాలజిస్టు ఆచార్య ఉత్తకుమార్ దాస్ తెలిపారు.

☛ ఒకసారి ఓపీకి వచ్చిన వారు రూ. 10 చెల్లిస్తే చాలు. ఏడాదిలో ఎన్నిసార్లు వచ్చినా తిరిగి యూజర్ ఛార్జీలు చెల్లించనవసరం లేదని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబానందకర్ తెలిపారు.

☛ కిడ్నీ మార్పిడికి సంబంధించి సుమారు మూడు మాసాల పాటు సేవలు పొందాల్సి ఉంటుంది. వారు ఇక్కడే ఉండటానికి వీలుగా కంపెనీ సామాజిక బాధ్యత కింద దాతలు ముందుకొచ్చి ఓ భవనం నిర్మిస్తే రోగులకు ప్రయోజనకరంగా ఉంటుందని వైద్యులు సూచించారు.

ఔట్ పేషెంట్ సేవలు ప్రారంభం: 2019 మార్చి 12
ప్రధానమంత్రి చేతుల మీదుగా జాతికి అంకితం: 2024 ఫిబ్రవరి 25

రూ.కోట్ల భూమి కొల్లగొట్టారు

వైకాపా హయాంలో చెరువు స్థలం ఆక్రమణ ❖ దాత కుటుంబ సభ్యుల ఫిర్యాదు

పొన్నూరు, న్యూస్‌టుడే

మంచినీటి కోసం దాతలు ఇచ్చిన రూ.కోట్లు విలువ చేసే భూమి ఆక్రమణకు గురైంది. గత వైకాపా పాలనలో ఈ చెరువుకు కొలతలు కొలిచి హద్దులు నిర్ణయించకుండా రూ.లక్షలు ఖర్చు చేసి ప్రహరీ నిర్మించారు. చెరువు ఆక్రమణకు గురైందని, హద్దులు తేల్చమని దాత కుటుంబ సభ్యులు కొంత కాలం కిందట జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి రోజులు గడుస్తున్నా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు హద్దులు నిర్ణయించడంతో తీవ్ర జాప్యం చేస్తున్నారు. పొన్నూరు పట్టణం నిడుబ్రోలు నడిబొడ్డున 241 సర్వే నంబరులో సుమారు 3 ఎకరాల భూమిని ఏళ్ల కిందట పాములపాటి వంశీయులు ఆ ప్రాంతంలో మంచి నీటి చెరువుగా ఏర్పాటు చేశారు. కాలక్రమంలో అది కాస్త మురుగునీటి చెరువుగా మారింది. 2018లో దీనిని అభివృద్ధి పరిచేందుకు అప్పటి తెదేపా ప్రభుత్వం రూ.కోటికి పైగా నిధులు కేటాయించింది. అప్పటి పురపాలక సంఘ అధికారులు చెరువును సర్వే చేయించి హద్దులు తేల్చారు. 2019లో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చెరువు అభివృద్ధి పనులకు రూ.1.50 కోట్లు కేటాయించింది. వీటితో చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు.



నిడుబ్రోలులో పాములపాటి పద్దన్న చెరువు


కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్

వైకాపా నాయకులు, అప్పటి పురపాలక సంఘ అధికారులు హద్దులు పరిగణనలోకి తీసుకోకుండా చుట్టూ ప్రహరీ నిర్మించారు. కొంత కాలం కిందట చెరువును ఆక్రమించుకున్న యజమానులు భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ వ్యవహారంపై విచారణ చేయాలని దాత కుటుంబ సభ్యుడు పాములపాటి నరేంద్ర గతంలో కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చెరువును సర్వే చేయమని జిల్లా ఉన్నతాధికారులు పురపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. కానీ సర్వే నిర్వహించలేదు.

40-50 సెంట్లు కబ్జా

ప్రస్తుతం చెరువు 40 నుంచి 50 సెంట్లు వరకు ఆక్రమణకు గురైందని స్థానికులు తెలిపారు. ఆ ప్రాంతంలో సెంటు రూ.10 లక్షలు నుంచి రూ.12 లక్షలు వరకు ధర పలుకుతోంది. దీనిప్రకారం ఆక్రమణకు గురైన స్థలం సుమారు రూ.5.50 కోట్లు నుంచి రూ.6 కోట్లు ఉంటుందని కాలనీ వాసులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెరువు స్థలాన్ని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఈ విషయాన్ని పురపాలక సంఘం టీపీఎస్ రాఘవరావు వద్ద ప్రస్తావించగా.. తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నానని, చెరువుపై ఫిర్యాదు వచ్చిన మాట వాస్తవమేనని, త్వరలో విచారించి వివరాలు వెల్లడిస్తానని తెలిపారు



సీడ్ యాక్సెస్ రోడ్డు బైపాస్ వంతెన దాటాక మట్టి కొట్టుకుపోయి ఏర్పడిన గొయ్యి



వెంకటపాలెం దాటాక ఇలా..



మరో చోట ఇలా..

రోడ్డు పక్కకెళ్లొద్దు!

రాజధాని అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డు దుస్థితికి నిదర్శనమీ చిత్రాలు. గత వైకాపా పాలనలో ఇదేవిధంగా నిర్వహణను ఏమాత్రం పట్టించుకోలేదు. రహదారి మార్జిన్లలో పెద్దఎత్తున మొక్కలు పెరిగిపోయినా తొలగించాలని కనీసం పైసా కూడా కేటాయించలేదు. వెంకటపాలెం నుంచి హైకోర్టుకు వెళ్లే మార్గం వరకు పలుచోట్ల ఇదే పరిస్థితి. గతంలో కొన్నిచోట్ల మార్జిన్లు విరిగిపోయి పక్కనే ఉన్న కాలువలోకి ఒరిగిపోయాయి. అయినా బాగు చేయలేదు. తూతూమంత్రంగా హెచ్చరిక బోర్డులు పెట్టి వదిలేశారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు తాజాగా కొన్నిచోట్ల రహదారి కింద మట్టి కొట్టుకుపోయి మార్జిన్లు విరిగిపోతున్నాయి. ముఖ్యమంత్రి సహా ప్రముఖులు ప్రయాణించే ఈ రహదారిని వెంటనే బాగు చేయాల్సిన అవసరం ఉంది. - ఈనాడు, అమరావతి

53,641 మిర్చి బస్తాల విక్రయం

మిర్చియార్డు: గుంటూరు మిర్చియార్డులో గురువారం 53,641 మిర్చి బస్తాల విక్రయాలు జరిగాయి. రైతులు 54,870 బస్తాలు యార్డుకు తరలించారు. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 26,718 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.8,000-16,000, నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9,000-18,600, తాలు మిర్చికి రూ.5,000-11,500 ధర లభించింది. ఏసీ కామన్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9,000-16,500, ఏసీ స్పెషల్ వెరైటీ మిర్చి రకాల సగటు ధర రూ.9,000-18,500, తాలు మిర్చికి రూ.5,000-11,000 ధర లభించింది.

రూ.కోటి ఖర్చుకు అనుమతి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: గుంటూరు వైద్య కళాశాలలోని వివిధ విభాగాల్లో పరికరాలు, రసాయనాల కొనుగోలుకు రూ.కోటి మంజూరు చేసేందుకు కళాశాల అభివృద్ధి కమిటీ ఆమోదం తెలిపింది. కళాశాలలో గురువారం నిర్వహించిన ఈ కమిటీకి రాష్ట్ర వైద్య విద్య సంచాలకుడు నరసింహం వర్చువల్‌గా హాజరయ్యారు. వివిధ విభాగాలకు అవసరమైన పలు అంశాలను అజెండాలో పొందుపర్చగా వాటికి ఆమోదం తెలిపారు. అనంతరం కమిటీ సభ్యురాలైన సర్వజన సుపత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ క్లినికల్ విభాగాలకు నిధులను కేటాయించాల్సిన అవసరం ఉందని వివరించారు. సమావేశంలో చర్చించిన అజెండాలో కేవలం నాన్ క్లినికల్ విభాగాలకే నిధుల కేటాయింపు ఉందని తెలిపారు. దీనిపై ప్రిన్సిపల్, సూపరిండెంటెంట్ చర్చించుకుని తదుపరి సమావేశానికి అజెండా రూపొందించాలని డీఎంఈ నరసింహం సూచించారు.

7, 8 తేదీల్లో రోలర్ స్కేటింగ్ ఎంపికలు

గుంటూరు క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 36వ అంతర్ జిల్లా రోలర్ స్కేటింగ్ ఎంపికలు జూనియర్, సీనియర్ విభాగాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా సంఘ అధ్యక్షురాలు నీలిమ తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు. పోటీలు మంగళగిరి రోడ్డులోని రమణక్క వెన్యూలో జరుగుతాయన్నారు. వివరాలకు 92464 85116, 78993 22259 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

8 నుంచి దసరాకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

పట్నంబజారు, న్యూస్‌టుడే: దసరా పండగ సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు రోజూ ప్రత్యేక బస్సులు హైదరాబాద్ నుంచి గుంటూరు జిల్లాలోని ఆయిదు డిపోల బస్టాండ్లకు ఏర్పాటు చేసినట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి రవికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదీ 7 బస్సులు, 9వ తేదీ 18 బస్సులు, 10న 28, 11న 35 బస్సులు ఏర్పాటు చేశామని, హైదరాబాద్ పరిసర ప్రాంతాల నుంచి గుంటూరుకు వచ్చే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. పండగ ముగిసిన తరవాత 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని వివిధ బస్టాండ్ల నుంచి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్, చెన్నై, తిరుపతి, బెంగళూరు, విశాఖపట్నంకు బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రయాణికులు ముందస్తు రిజర్వేషన్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

పత్తి రైతులు ఆర్ఎస్‌కేలో పేర్లు నమోదు చేసుకోండి

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పత్తి రైతులు.. వారి పేర్లను సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన ఛాంబర్‌లో గురువారం పత్తి కొనుగోళ్లపై సమావేశం నిర్వహించారు. భార్గవ్ తేజ మాట్లాడుతూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో యార్డులు, పత్తి కొనుగోళ్ల కేంద్రాలను నోటిఫై చేశామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పేరు నమోదు చేసుకున్న తర్వాత సమీపంలోని జిన్నింగ్ మిల్లుకు తీసుకెళ్లి పత్తిని ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటా రూ.7521కు అమ్ముకోవచ్చన్నారు. మధ్యవర్తులు, దళారుల వద్దకు రైతులు వెళ్లవద్దన్నారు. మిల్లులు, మార్కెట్ యార్డుల వద్ద మధ్యవర్తులు, దళారులు ఉంటే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సమావేశంలో సహాయ మార్కెటింగ్ సంచాలకులు బి.రాజాబాబు, డీఏఓ నున్నా వెంకటేశ్వర్లు, సీసీఐ బయ్యర్లు పి.నాగేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, మార్కెటింగ్ శాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

నేటి నుంచి యూటీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు తదితరులు

నగరపాలకసంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల సందర్భంగా శుక్రవారం నుంచి 3 రోజులపాటు గుంటూరులో నిర్వహించే రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. గురువారం బ్రాడీపేట యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో క్రీడోత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. జిల్లాల వారీగా 15 అంశాల్లో క్రీడలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రారంభోత్సవానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారని చెప్పారు. 4, 5, 6న జరగనున్న క్రీడాపోటీలు నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంతోపాటు, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్, పిచ్చుకలగుంట గ్రౌండ్, పోలీస్ పరేడ్ గ్రౌండ్, కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీ క్రీడామైదానాల్లో జరుగుతాయన్నారు. గోడపత్రిక ఆవిష్కరణలో రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర సహాధ్యక్షురాలు కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా జీవీ రమణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సత్యాగ్రహ దీక్ష



దీక్షలో కూర్చున్న రైతు, వ్యవసాయ, కార్మిక, మహిళా సంఘాల నాయకులు

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: విశాఖ ఉక్కు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రైతు, వ్యవసాయ, కార్మిక, మహిళా సంఘాల ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మూడో రోజు గురువారం సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. మూడో రోజు దీక్షను నల్లమడ రైతు సంఘం కన్వీనర్ డాక్టర్ కొల్లా రాజమోహన్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శివాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. ఈశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగన్నాథం, కె.వి.వి.ప్రసాద్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఇ.అప్పారావు, రైతు సంఘం నాయకులు ఎం.శివశంకరరావు, జి.సత్యానందం, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఆర్.కుమారి, నగర కార్యదర్శి లక్ష్మి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం.. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ఉద్యమంలో కార్మిక, రైతు సంఘాలు భాగస్వాములై అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, రైతు కూలీ సఘం జిల్లా కార్యదర్శి ఉల్లిగడ్డ నాగేశ్వరరావు, ఐఎల్‌పీ రాష్ట్ర నాయకులు జె.నరసింహారావు, విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

7 మి.మీ సగటు వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు సగటున 7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. మేడికొండూరు మండలం 37.8, పెదకాని 15, తాడేపల్లి 13.6, పెదనందిపాడు 9.4, తాడికొండ 9.2, దుగ్గిరాల 8.4, మంగళగిరి 6.6, తుళ్లూరు 6.2, ఫిరంగిపురం 5.6, చేబ్రోలు 3.6, గుంటూరు పశ్చిమ 3.4, గుంటూరు తూర్పు 3.2, కొల్లిపర 2.4, వట్టిచెరుకూరు 0.6, కాకుమాను 0.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

ఏపీఎస్ఎస్‌డీసీ ఈడీగా రఘు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కె.రఘు నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం గుంటూరు జిల్లా ఉపాధి కల్పన అధికారిగా పని చేస్తున్నారు. ఆయన్ను రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య విభాగమైన నైపుణ్యాభివృద్ధి సంస్థకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

బినామీ పేర్లతో రుణాలు

న్యాయం చేయాలని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి మిర్చి రైతుల వినతి



మిర్చి రైతులతో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

మిర్చియార్డు, న్యూస్‌టుడే: 'మిర్చికి ధర వచ్చినప్పుడు అమ్ముకుందామని శీతలగిడ్డంగిలో నిల్వ చేస్తే మాకు తెలియకుండానే బినామీ పేర్లతో బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నారు. శీతలగిడ్డంగి యాజమాన్యం, మిర్చి వ్యాపారి కుమ్మక్కై మిర్చి బస్తాలను కూడా అమ్ముకున్నారు'.. అని రైతులు వాపోయారు. గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో గుంటూరు, పల్నాడు, ప్రకాశం, కర్నూలు జిల్లాలకు చెందిన పలువురు రైతులు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. మిర్చి సీజన్‌లో నల్లపాడు రోడ్డులోని రాఘవేంద్ర శీతలగిడ్డంగిలో బస్తాలను నిల్వ చేశామన్నారు. గిడ్డంగి యజమాని శివనాగిరెడ్డి, మిర్చి వ్యాపారి రాము మా సరకు చూపి జీడీసీసీ, టీఎంబీలో కోట్లాది రూపాయలు రుణం తీసుకున్నారన్నారు. అందులో కొన్ని బస్తాలను కూడా అమ్ముకుని సొమ్ము చేసుకున్నారని వాపోయారు. నల్లపాడు ఠాణాలో కేసు నమోదైనప్పటికీ మా సరకు ఇప్పించలేదని పెమ్మసాని దృష్టికి తీసుకువెళ్లారు. దీనికి స్పందించిన ఆయన ఎస్పీ సతీష్‌కుమార్, బ్యాంకర్లతో ఫోన్‌లో మాట్లాడారు. నల్లపాడు సీఐ వంశీధర్‌తో పాటు బ్యాంకుల మేనేజర్లను కార్యాలయానికి పిలిపించి మాట్లాడారు. అరెస్టులు చేయడం కంటే రైతులకు న్యాయం జరగడం ముఖ్యమని, తక్షణమే రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పెమ్మసాని ఆదేశించారు.

చోరీ కేసు ఛేదించేందుకు ప్రత్యేక బృందం

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: హుబ్బళ్లి నుంచి విజయవాడ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో గత నెల 28వ తేదీన భారీ దొంగతనం జరిగిన కేసును ఛేదించేందుకు రైల్వే రక్షకదళం ఆధ్వర్యంలో ఏకంగా నలుగురు ఇన్‌స్పెక్టర్లు మరో ముగ్గురు సిబ్బందితో కలిపి ఓ కమిటీని ఏర్పాటు చేస్తూ గుంటూరు రైల్వే డివిజన్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ శైలేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. 3.5 కిలోల బంగారు ఆభరణాలు, రూ.50 వేల నగదును దొంగలు అపహరించినట్లు ఫిర్యాదు అందింది. దీన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఆర్‌పీఎఫ్ అధికారులు ప్రభుత్వ రైల్వే పోలీసులతో కలిసి దొంగలను పట్టుకునేందుకు గాలిస్తున్నారు. ఇప్పటికే ఈ రెండు విభాగాల అధికారులు సంయుక్తంగా సమావేశం నిర్వహించి కేసుపై సుదీర్ఘంగా చర్చించారు.

విజిలెన్స్ విచారణకు హాజరవ్వాలని మాజీ ఛైర్మన్లకు పిలుపు

మిర్చియార్డు, న్యూస్‌టుడే: గత ప్రభుత్వంలో మిర్చియార్డులో జరిగిన అక్రమాలు, అవతవకలకు సంబంధించి విజిలెన్స్ విచారణ కొనసాగుతోంది. వైకాపా అధికారంలో ఉన్న సమయంలో మిర్చియార్డు ఛైర్మన్లుగా పని చేసిన చంద్రగిరి ఏసురత్నం, సుధాకరరెడ్డి, నిమ్మకాయల రాజనారాయణలను విచారణకు హాజరుకావాలని విజిలెన్స్ అధికారుల నుంచి పిలుపు వచ్చింది. చంద్రగిరి ఏసురత్నం స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో తర్వాత వస్తానని చెప్పారు. నిమ్మకాయల రాజనారాయణ సోమవారం విచారణకు హాజరవుతానని తెలిపారు. మార్కెటింగ్ శాఖ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో ప్రస్తుతం విజిలెన్స్ విచారణ తుది దశకు చేరుకున్న తరుణంలో ఇది ముగిశాక ప్రారంభించాలని మార్కెటింగ్ శాఖ అధికారులకు మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు లేఖ రాశారు. 11 మంది కమిటీలో నలుగుర్ని తొలగించాలని కోరారు. నలుగురు అధికారులపై అవినీతి ఆరోపణలు ఉన్నందున వారిని కమిటీలో నుంచి తప్పించాలని ఆ శాఖ కమిషనరేట్ అధికారులను కోరినట్లు సమాచారం.

75 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

పొన్నూరు, న్యూస్‌టుడే: అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తుండగా పొన్నూరు గ్రామీణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గ్రామీణ పోలీసుల కథనం ప్రకారం... పొన్నూరు పరిసర ప్రాంతాల్లో నిరు పేదల నుంచి రేషన్ బియ్యాన్ని కొందరు కొనుగోలు చేసి ఉప్పరపాలెంలోని రహస్య ప్రాంతానికి తరలించారు. అక్కడ నుంచి మరొక ప్రాంతానికి తరలించేందుకు బియ్యాన్ని లారీలో ఎక్కించి బయలు దేరుతున్న సమయంలో గ్రామీణ ఎస్సై కిరణ్‌బాబు ఆ ప్రాంతానికి వెళ్లి 75 బస్తాల (ఒక్కో బస్తా 50 కేజీలు) రేషన్ బియాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీ డ్రైవర్ మురళిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. రేషన్ బియ్యం పోకల శ్రీనివాసరావు (తాళ్ళపాలెం), తాడిశెట్టి నాగేశ్వరరావు (ఉప్పరపాలెం)లకు చెందినవిని తెలియడంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై పేర్కొన్నారు.

పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ



అధికారులతో మాట్లాడుతున్న నిశాంత్ కుమార్

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : మద్యం దుకాణాల కోసం దరఖాస్తుల స్వీకరణ, లాటరీ ద్వారా ఖరారు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడుతున్నట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ప్రత్తిపాడులో ఎక్సైజ్ కార్యాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని మండలాలకు చెందిన 13 దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ ఎలా చేస్తున్నారని డీసీ కె.శ్రీనివాస్, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి అరుణ కుమారిలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆన్‌లైనులో, ఎక్సైజ్ కార్యాలయాల్లో దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించామని చెప్పారు. జిల్లాలో ఉన్న ఏ దుకాణం కోసమైన ఏ కార్యాలయంలో నుంచైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సిండికేటుకు అవకాశం లేకుండా అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకున్నట్లు వివరించారు. దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన అన్ని వివరాలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలని డీసీని ఆదేశించినట్లు తెలిపారు. ప్రత్తిపాడు సీఐ వై.అశోక్ కుమార్, ఎస్సై రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోకపోతే.. 24 శాతం మందికి మధుమేహం రావొచ్చు



మోనిషాకు ప్రతిభ ధ్రువపత్రం అందజేస్తున్న ఫణీంద్ర

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: జాగ్రత్తలు తీసుకోకపోతే గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న వారిలో 24 శాతం మందికి మధుమేహం వచ్చే ప్రమాదం ఉందని కాటూరి వైద్య కళాశాల హౌస్‌సర్జన్ మోనిషా బోడాల చేసిన పరిశోధనలో తేలింది. గ్రామీణ ప్రాంత ప్రజల్లో హైపర్ ఇన్సులినిమియాపై ఆమె సమర్పించిన పరిశోధనా పత్రానికి జాతీయ స్థాయిలో రెండో స్థానం దక్కడం గమనార్హం. ఎయిమ్స్ రిషికేష్‌లో గత నెల 28, 29 తేదీల్లో నేషనల్ ఫ్యామిలీ మెడిసిన్, ప్రైమరీ కేర్ 6వ జాతీయ సదస్సులో మోనిషా పాల్గొంది. కాటూరి వైద్య కళాశాల నిర్వహిస్తున్న గ్రామీణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రత్తిపాడు శివారు కాలనీల్లో నివసిస్తున్న వారిలో మధుమేహ సమస్య లేని 100 మందిని పరిశోధనకు ఎంపిక చేసుకుంది. వీరి నుంచి రక్త నమూనాలు సేకరించి క్రాఫ్ట్ పరీక్ష నిర్వహించారు. ఇందులో హైపర్ ఇన్సులినిమియా 24 శాతం మందిలో ఉన్నట్లు తేలింది. జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తులో మధుమేహం వచ్చే ప్రమాదం ఉందని నిర్ధారణ జరిగింది. వారందరి ఇళ్లకు వెళ్లి జీవనశైలిలో మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియమాలు వివరించారు. జాతీయ స్థాయిలో అవార్డు గెలుచుకుని కళాశాలకు వచ్చిన మోనిషాను గురువారం కమ్యూనిటీ మెడిసిన్ విభాగం అధిపతి ఆచార్య ఫణీంద్ర కళాశాల ఛైర్మన్ స్వైరారావు, డీన్ వరప్రసాద్, ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ మోహనరావు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 121, రిటైల్ ధర - 143, చికెన్ విత్‌స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -118 రిటైల్ ధర 140 చికెన్ విత్ స్కిన్ - 203, చికెన్ స్కిన్‌లెస్ - 231.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, 132, 142 చికెన్ విత్ స్కిన్ - 230 చికెన్ స్కిన్‌లెస్ - 240.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

తెనాలి

• తెనాలి • పొన్నూరు

ఇసుక లభ్యతపై దృష్టి సారించాలి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ఇసుక లభ్యం కాక కూలీ దొరకడం లేదని, మరో వైపు అమాంతంగా పెంచేసిన నిత్యావసరాల ధరలతో కార్మికులు వీధిన పడే పరిస్థితి దాపురించిందని సీఐటీయూ జిల్లా నాయకుడు కొల్లిపర బాబూప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన గురువారం గాంధీచౌక్‌లో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై నిర్వహించిన ఆందోళనలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక లభ్యతపై దృష్టి సారించాలని ఆయన కోరారు. శుక్రవారం తెనాలి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న ధర్నాకు తరలిరావాలని ఆయన కోరారు.

పంచాయతీ కార్యదర్శి చొరవతో అభివృద్ధి

వెనిగండ్ల (పెదకాకాని), న్యూస్‌టుడే: వెనిగండ్ల పంచాయతీకి ఇన్‌ఛార్జి కార్యదర్శి జి.హరిబాబు చొరవ తీసుకోవడంతోనే గ్రామంలో అతి తక్కువ కాలంలో అభివృద్ధి పనులు జరిగినట్లు పంచాయతీ బోర్డు పాలక మండలి సభ్యులు పేర్కొన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆయన తాడికొండకు వెళ్తున్న నేపథ్యంలో గురువారం వెనిగండ్ల పంచాయతీలో బోర్డు సభ్యులు వీడ్కోలు సభ నిర్వహించి సత్కరించారు. ఈ సందర్భంగా బోర్డు సభ్యులు మాట్లాడుతూ మండలంలోని అగతవరప్పాడు పంచాయతీ కార్యదర్శిగా హరిబాబు ఉంటూ వెనిగండ్ల ఇన్‌ఛార్జి బాధ్యతలు తీసుకొని గ్రామంలో అభివృద్ధి పనులు జరగటంలో కీలక పాత్ర వహించినట్లు చెప్పారు. గ్రామంలోని రెండు వర్గాలను ఏకతాటిపై తెచ్చి పనుల తీర్మానాలు ఆమోదమయ్యేలా కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచి శ్రావణి, ఉప సర్పంచి వెంకటరెడ్డి, వార్డు సభ్యులు, గుమస్తా ప్రభు, తెదేపా గ్రామ అధ్యక్షుడు తిరుమలరెడ్డి పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? పట్టణ పరిధి నిడుబ్రోలు 15వ వార్డులో రహదారిపై గొయ్యి ప్రమాదకరంగా మారింది. మరమ్మతులు చేపట్టాలి. **-పి.రమణ**

✔ గొయ్యి పూడ్చిస్తాం. **-అపర్ణ, సహాయ ఇంజినీర్**

? పట్టణంలోని బాలాజీనగర్ మురుగు కాలువలో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. **-కె.రంగారావు**

✔ వ్యర్థాలను తొలగించే విధంగా తగు చర్యలు తీసుకుంటా. **-శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి**

-న్యూస్‌టుడే, పొన్నూరు

స్పందనకు వందనం

వ్యర్థాల తొలగింపు

మేమున్నాం...మీకు తోడుగా శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనానికి ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. భావనగర్‌కాలనీలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు. నిడుబ్రోలు వడ్డిముక్కల రోడ్డులో మురుగు కాలువలో వ్యర్థాలను తొలగించారు.

-న్యూస్‌టుడే, పొన్నూరు

భారం తగ్గడంతో ప్రజలకు సాంత్వన

✤ చెత్త పన్ను రద్దుపై హర్షం



ఇంటి నుంచి చెత్త సేకరిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

తెనాలి పట్టణ జనాభా	: 1.90 లక్షలు
కుటుంబాలు, వ్యాపార సంస్థలు	: 49,050
రోజూ చెత్త సేకరణ	: 70 టన్నులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పట్టణాల్లో ఇళ్లు, వ్యాపార సంస్థల నుంచి సేకరించిన చెత్తను తరలించే అద్దె ఆటోలకు రుసుం చెల్లించేందుకు ప్రజలపై పన్ను పెనుభారాన్ని మోపింది. దీనిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించిన నేపథ్యంలో గత ఎన్నికల్లో కూటమి పార్టీలు ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబునాయుడు బుధవారం చెత్త పన్ను రద్దు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

✤ తెనాలి పురపాలక సంఘంలో 2022 జూన్ నుంచి చెత్త పన్ను వసూలు చేపట్టారు. పట్టణంలోని మొత్తం గృహాలు, వ్యాపార సంస్థల నుంచి చెత్త సేకరించిన 35 ఆటోలకు ఒక్కోదానికి నెలకు రూ.62,115 వంతున చెల్లించేందుకు ఇంటికి రూ.50, వ్యాపార సంస్థకు రూ.150 చొప్పున పన్ను విధించారు. గత ప్రభుత్వ ఆదేశాల మేరకు 2024 మార్చి వరకు పన్ను వసూలు చేశారు. సాధారణ ఎన్నికలు రావడంతో వసూలు చేయకుండా ఆపించారు. మున్సిపాలిటీ నుంచి చెత్తపన్ను కింద ఇప్పటి వరకు ప్రజల నుంచి వసూలు చేసిన రూ.4 కోట్లు ప్రభుత్వానికి చెల్లించారు.


సీఎం మాట నిలబెట్టుకున్నారు



మున్సిపల్ అద్దె దుకాణాల్లో పిండి మరలు నడుపుతున్నా. ఒక్కోదానికి రూ.150 వంతున నాలుగింటికి కలిపి రూ.600 చెత్తపన్ను వసూలు చేశారు. భారం తొలగించాలని కోరినా వినిపించుకోలేదు. విధి లేని పరిస్థితిలో చెల్లించా. సాధారణ ఎన్నికలకు రెండు నెలల ముందు మాత్రం పన్ను చెల్లించాలని అడిగిన వారు లేరు. సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ఆ పన్ను రద్దు చేసి మాట నిలబెట్టుకున్నారు. ఆయనకు కృతజ్ఞతలు. పన్ను భారం శాశ్వతంగా తొలగిపోయింది.

- కోటా వెంకటేశ్వరరావు, పిండిమర వ్యాపారి, తెనాలి

ఆనందం కలిగించింది



ముఠా కూలీగా నాకు రోజుకు రూ.500 వస్తుంది. ఈ ఆదాయంతో ఇంటికి అద్దె చెల్లించి కుటుంబ అవసరాలు తీర్చుకోవాలి. చెత్తపన్ను చెల్లించేంత శక్తి లేదు. ఈ పన్ను రద్దు చేయడంతో ఆనందం కలిగింది. ఈ పైకాన్ని కుటుంబ అవసరానికి వినియోగించుకుంటా. **- మొహిద్దీన్, ముఠా కూలీ, పాండురంగపేట**

పిచ్చి మొక్కలతో వెతలు



పట్టణ పరిధి 15వ వార్డులో నిర్వహణ లేని ఖాళీ స్థలంలో పిచ్చి మొక్కలు పెరిగి వాటిల్లో విషసర్పాలు చేరడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. వాటిల్లోని కొన్ని తీగ మొక్కలు పరిసరాల్లోని ఇళ్ల మీదకు, చెంతనే ఉన్న స్తంభాల మీదకూ పాకుతున్నాయి. మరి కొన్ని రోజులు ఇలానే వదిలేస్తే విద్యుత్తు తీగలపైకి కూడా చేరతాయి. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, తెనాలి టౌన్

విజ్ఞాన్‌లో 30ఎం జీనోమిక్స్ కేంద్రం



ప్రారంభిస్తున్న ఉపకులపతి నాగభూషణ్

పొన్నూరు, న్యూస్‌టుడే: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో హైదరాబాద్‌కు చెందిన 30ఎం జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీ సెంటర్‌ను గురువారం ఉప కులపతి పి.నాగభూషణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచ మానవళిలో ఎవరైనా ఒకే రోగంతో బాధపడుతున్న వివిధ రకాల వ్యక్తులకు ఒకే రకమైన వైద్యం సరిపోదని వెల్లడించారు. డీఎన్ఏల ఆధారంగా పర్సనలైజ్డ్ వైద్యం అవసరమన్నారు. 30ఎం జీనోమిక్స్ స్టార్టప్ కంపెనీ పర్సనలైజ్డ్ మెడిసిన్‌లో భాగంగా ఫార్మకోజెనిటిక్స్ ఆప్రోచ్ ద్వారా ఔషధానికి సంబంధించిన డోస్‌లను ముందుగానే గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్టప్ కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బెన్నెట్ బాస్కోదాస్, డైరక్టర్లు పావని, రిజిస్ట్రార్ ఎంఎస్.రఘునాథన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి మూలం శుభ్రత

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: ప్రజారోగ్యానికి మూలం శుభ్రత అని మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. ఆమె గురువారం పట్టణంలోని 5, 13, 26 వార్డుల్లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురుగు ముందుకు కదలని కాలువల్లో పూడిక తీయాలని, వ్యర్థ జలాలు రోడ్డు పైకి రాకుండా కాలువల్లోకి మళ్లించాలని కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ బండి శేషన్న, సహాయ కమిషనర్ వి.లక్ష్మీపతిరావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అన్నదానం


తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ గొల్లపూడి చంద్రమౌళి వర్ధంతి సందర్భంగా గురువారం యడ్లలింగయ్య కాలనీలోని పేదలకు అన్న, వస్త్ర దానం చేశారు. అనూరాధ, బి.టి.వి.ఎస్.నారాయణ పాల్గొన్నారు.. ★ శ్రీ సాయి ప్రసాదం సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం చినరావూరు డొంకరోడ్డులో పేదలకు అన్నదానం చేశారు.

వీనుల విందుగా భక్తి సంగీత విభావరి

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: దసరా నవరాత్రుల సందర్భంగా గురువారం బోసురోడ్డులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో నిర్వహించిన భక్తి సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. విశాఖపట్నానికి చెందిన ఆకెళ్ల హిమబిందు భక్తి గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తనా బృందం సామూహిక శ్రీ లలితా సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

★ శివాజీచౌక్‌లోని కాళీమాత ఆలయ ఛైర్మన్ గుమ్మడి రమేష్ ఆధ్వర్యంలో ఏర్పాటైన శక్తిస్వరూపిణి అమ్మవారి విగ్రహం వద్ద రాష్ట్ర మహిళా కమిషన్ పూర్వ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నటరాజ నృత్య కళానికేతన్ కళాకారిణుల కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ కళాకారిణులను ఆమె అభినందించారు.

సీఎం సహాయ నిధికి రూ. లక్ష విరాళం



చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న బ్రాహ్మణ సేవా సమాఖ్య నాయకులు

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: పట్టణ బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం విరాళం కింద రూ.1 లక్ష చెక్కును గురువారం సీఎం నారా చంద్రబాబు నాయుడుకు అందజేశారు. ఈ వివరాలను సమాఖ్య కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి, ఉపాధ్యక్షుడు కుందేటి వెంకట సుబ్రహ్మణ్యం, తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ వేమూరి ఆనంద సూర్య గురువారం తెనాలిలో తెలిపారు.

అన్న క్యాంటీన్‌కు రూ.25వేలు..

తెనాలి (కొత్తపేట): పట్టణానికి చెందిన కె.వి.సత్యనారాయణ చౌదరి అన్న క్యాంటీన్‌కు రూ.25వేలు విరాళం అందించారు. ఈ మేరకు ఆయన చెక్కును గురువారం మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నకు అందజేశారు.

సేవా భావం ప్రశంసనీయం



మంత్రి సవితకు చెక్కు అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ సభ్యులు

మంగళగిరి, న్యూస్‌టుడే : పదవీ విరమణ చేశాక కూడా సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ సీఎం సహాయనిధికి రూ.లక్ష ఇవ్వడం ప్రశంసనీయమని మంత్రి ఎస్.సవిత అన్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు బి.వి.వి.కొండలరావు, ప్రధాన కార్యదర్శి ఎ.యెల్లారావు తదితరులు మంత్రిని గురువారం కలిసి చెక్కును అందజేశారు.

నగరంలో అర్ధరాత్రి పోలీసు నాకాబందీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో గురువారం అర్ధరాత్రి పోలీసులు నాకాబందీ నిర్వహించారు. నంబర్‌ప్లేట్‌లేని వాహనాలతో సంచరించడం, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడటం, మద్యం తాగి వాహనాలు నడపటం, రాత్రి వేళల్లో దొంగతనాలు, దోపిడీలకు పాల్పడటం వంటి నేరాలు అరికట్టాలనే ఉద్దేశంతో ఎస్పీ సతీష్‌కుమార్ రాత్రివేళల్లో ఆకస్మికంగా వాహనాల తనిఖీకి ఆదేశించారు. నగరంలోని నెహ్రూనగర్, లాలాపేట, కొత్తపేట, పాతగుంటూరు, నల్లచెరువు తదితర ప్రధాన కూడళ్లలో వంద మంది పోలీసులు నాకాబందీలో పాల్గొన్నారు. సరైన పత్రాల్లేని, మద్యం తాగి నడుపుతున్నవారి వాహనాలను జప్తు చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా ఆయా ప్రాంతాలలో పర్యటించి తనిఖీ తీరును పరిశీలించారు. నేరాలకట్టడికి ముందస్తు చర్యల్లో భాగంగా నాకాబందీ చేపట్టామని ఎస్పీ తెలిపారు. డీఎస్పీలు సుబ్బారావు, అజీజ్, జయరాంప్రసాద్, శివాజీరాజు, రమేష్, సీఐ వెంకన్నచౌదరి, అశోక్, శివప్రసాద్, వీరయ్య, శింగయ్య, సోమయ్య, వీరనాయక్, శ్రీనివాసరావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

దాండియా సందడి



తెనాలి టౌన్: బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రీ ఉన్నత పాఠశాలలో గురువారం దాండియా ఉత్సవం సందడిగా సాగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన టీ-20 క్రికెట్ పోటీల్లో పాల్గొని జట్టు విజయానికి దోహద పడిన 8వ తరగతి విద్యార్థి ప్రణవ్, 5వ తరగతి విద్యార్థి నీహాల్‌లను ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయిని జ్యోతి సత్కరించారు.

శక్తిస్వరూపిణి.. బాలాత్రిపుర సుందరి



తెనాలి: వాసవీ మాత ఆలయంలో బాలాత్రిపుర సుందరీదేవిగా..



తెనాలి: దేవీచౌక్ రాజరాజేశ్వరి దేవి దేవస్థానంలో..



గంగానమ్మపేట పర్వతవర్ధనీ రామేశ్వరస్వామి ఆలయంలో..



రామలింగేశ్వరపేట దుర్గా పార్వతీ రామలింగేశ్వరస్వామి ఆలయంలో..



చినరావూరు: బాలాత్రిపుర సుందరీదేవిగా...



బాలాజీరావుపేట: ఊయలలో అమ్మవారు



వడ్లమూడి గరువుపాలెం వద్ద..



పొన్నూరు తోటమ్మ తల్లి దేవాలయంలో వివిధ రూపాల్లో అలంకరణలు



పొన్నూరు: కుంకుమపూజలో మహిళలు

తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో గురువారం దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. వాసవీ, శివాలయాల్లో అమ్మవార్లను బాలాత్రిపుర సుందరీదేవి, రాజరాజేశ్వరిదేవి, భవానీదేవిగా ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పందిరిలో అమ్మవారి ప్రతిమను ఏర్పాటు చేసి పూజలు నిర్వహిస్తున్నారు. కుంకుమ పూజల్లో మహిళలు పాల్గొన్నారు. పలు ఆలయాల్లో సాయంత్రం లలిత సహస్రనామ పారాయణ చేశారు. దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన పెదకాకాని మల్లేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణం విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇక్కడ తొలి రోజు భ్రమరాంబ బాలా త్రిపురసుందరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.

–న్యూస్‌టుడే, బృందం



పెదకాకానిలో..



కొల్లిపర జనార్దనస్వామివారి ఆలయంలో..



పొన్నూరు కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో



కొత్తరెడ్డిపాలెంలో దుర్గమ్మ

పనివేళల్లో వైద్యులు ఆసుపత్రిలో ఉండాలి



రోగులతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ మజీద బేగం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే: వైద్యులు, సిబ్బంది జిల్లా ఆసుపత్రి పనివేళల్లో రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ మజీదబేగం ఆదేశించారు. ఆమె గురువారం తెనాలి జిల్లా ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఉదయం ఓపీకి వచ్చిన రోగులకు రాసిన ప్రయోగశాల పరీక్షల నివేదిక వచ్చే వరకు ఉండి మందులు రాసి పంపించాలని ఆమె సూచించారు. రోగులకు సంతృప్తికరమైన సేవలందించాలని పేర్కొన్నారు. వైద్యసేవలు, ఆహారపట్టిక అమలుపై తల్లీపిల్లల విభాగంలో బాలింతలను కలిసి అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై అవగాహన పెంపొందించుకొని ఆచరించాలని ఆమె సూచించారు.

పొలం పిలుస్తోందిపై అవగాహన

పెదకాకాని, న్యూస్‌టుడే: వరి చిరు పొట్ట దశలోపు ఉండగానే నత్రజని వాడాలని, అప్పుడే పైరు బాగుంటుందని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు తోటకూరి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని గోళ్లమూడిలో గురువారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఏవో సంధ్యారాణితో కలిసి ఆయన పాల్గొన్నారు. వరి సాగు రైతులతో చర్చించి పలు సూచనలు చేశారు.

వడ్లమూడి (చేబ్రోలు), న్యూస్‌టుడే: అధికారుల సూచనల మేరకు మాత్రమే రసాయన ఎరువులు పిచికారీ చేసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం డీడీఏ సునీత అన్నారు. మండలంలోని నారాకోడూరు, వడ్లమూడి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులు ఆకుచుట్టు పురుగు, దోమను నివారించేందుకు నీమాస్త్రంను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి, ఏవో శ్రీనివాసానాయక్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: తెనాలి రైల్వే స్టేషన్‌లోని నాలుగో నంబరు ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని సుమారు 60 సంవత్సరాల వృద్ధుడు మృతి చెంది ఉండటాన్ని రైల్వే పోలీసులు గురువారం గుర్తించారు. మృతుడు రంగుల లుంగీ ధరించి ఉన్నారని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.



పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద స్వాగత చిత్రాలు

బడి గోడలు.. స్ఫూర్తి నినాదాలు



స్ఫూర్తిదాయక నినాదాల్లో ఒకటి ఇలా..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: పట్టణ మారీసుపేటలోని నల్లమోతు చెంచురామానాయుడు పురపాలక సంఘ ఉన్నత పాఠశాల మున్సిపల్ బడులన్నింటిలోకి పెద్దది. సుమారు 1,000 మందికి పైగా విద్యార్థులు ఇక్కడ చదువుకుంటున్నారు. బడి గోడలు నిత్యం సినీ పోస్టర్లతో నిండి ఉండేవి. పలు మార్లు వాటిల్లో అశ్లీల చిత్రాలు ఇబ్బంది పెట్టేవి. ఈ నేపథ్యంలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయిని సుధారాణి, హిందీ ఉపాధ్యాయుడు, ఎన్‌సీసీ అధికారి భాస్కరరావు ఇతర ఉపాధ్యాయులు పూనుకుని గోడలపై సినీ పోస్టర్లు తొలగింపు చేశారు. విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపే చక్కటి నినాదాలను గోడలపై రాయించి ఆదర్శంగా నిలిచారు.

కౌలు రైతులకే పరిహారం ఇవ్వాలని ఆందోళన



తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

చేబ్రోలు, న్యూస్‌టుడే: పంటల నష్టపరిహారం కౌలు రైతులకే అందించాలని కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి భైరగాని శ్రీనివాసరావు కోరారు. మండలంలోని పలు గ్రామాల కౌలు రైతులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు కార్డులు, ఈ క్రాప్‌లో పేర్లు నమోదు కాకాపోయినా నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పినా క్షేత్ర స్థాయిలో జరగడంలేదన్నారు. అనంతరం రైతులతో కలిసి తహసీల్దార్ శ్రీనివాసశర్మకు వినతి పత్రం అందజేశారు.

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే: వరదలతో నష్టపోయిన రైతులకు ఇస్తామని ప్రకటించిన నష్టపరిహారం పూర్తి స్థాయిలో అమలు కాలేదని, గ్రామాల వారీ వివరాలు తీసుకుని ఈనెల 8న విజయవాడలోని ఎంబీకే భవనంలో జరగనున్న కౌలు రైతుల సదస్సుకు రావాలని రాష్ట్ర కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి భైరగాని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం తెనాలి గోలిడొంకలో రైతులతో కలిసి సదస్సు కరపత్రం విడుదల చేశారు.

5, 6 తేదీల్లో బస్సు పాసుల జారీ నిలిపివేత

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు పాసుల వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్ ఆధునికీకరణ నేపథ్యంలో ఈ నెల 5, 6 తేదీల్లో పాసుల జారీ నిలిపివేస్తున్నట్లు తెనాలి డిపో మేనేజర్ ఏ.రాజశేఖర్ గురువారం తెలిపారు.

విధుల బహిష్కరణ

తెనాలి టౌన్, న్యూస్‌టుడే: న్యాయవాదుల చట్టంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులు సరైనవి కాదంటూ నిరసన వ్యక్తం చేస్తూ తెనాలి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం న్యాయవాదులు విధులు బహిష్కరించారు.

అదుపు తప్పి.. డివైడర్ డ్రెయిన్‌పైకి దూసుకెళ్లిన బస్సు



నంబూరు వృద్ధాశ్రమం ఎదుట..

పెదకాకాని, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌పై దూసుకెళ్లిన ఘటన గురువారం నంబూరులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గుంటూరు-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (నాన్ స్టాప్) విజయవాడ నుంచి 35 మంది ప్రయాణికులతో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరింది. కంతేరు అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారి పైవంతెన నుంచి కిందకు వేగంగా దిగుతోంది. వృద్ధాశ్రమం వద్దకు వచ్చే సరికి జాతీయ రహదారి కుడి వైపు ఉన్న బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్ డ్రెయిన్ పైకి దూసుకెళ్లింది. డ్రెయిన్‌లో బస్సు టైర్లు ఇరుక్కుపోవడంతో సుమారు 150 అడుగుల దూరం వరకు దూసుకెళ్లి ఆగిపోయింది. అదృష్టవశాత్తు బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

వీవర్స్‌శాల సందర్శన



చీర పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, వీవర్స్‌శాల కమిటీ సభ్యులు

మంగళగిరి, న్యూస్‌టుడే : ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు గురువారం మంగళగిరిలోని వీవర్స్‌శాలను సందర్శించారు. చేనేత కార్మికులు చీరలు నేస్తున్న విధానాన్ని పరిశీలించారు. ప్రతినిధి బృందంలోని జయశర్మ, కేటీలకు వీవర్స్‌శాల కమిటీ సభ్యులు గుత్తికొండ ధనుంజయరావు, కారంపూడి అంకమ్మరావు అక్కడి వివరాలను వివరించారు. వీవర్స్‌శాల ద్వారా చేనేత కార్మికులకు అధునాతన డిజైన్లు నేర్పించడంతో పాటు ఆదాయం పెరిగే మార్గాలను మంత్రి నారా లోకేశ్ చూపిస్తున్నారన్నారని వారికి తెలిపారు.

కూటమి ప్రభుత్వం రాకతో నూతనోత్సాహం

తుళ్లూరు, న్యూస్‌టుడే : వైకాపా అరాచక పాలన అంతమై కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో యువతలో నూతన ఉత్సాహం నెలకొందని తాడికొండ, పెదకూరపాడు ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. మండలంలోని పెదపరిమిలో తెలుగు యువత ఆధ్వర్యంలో సుమారు 10 లక్షల ఖర్చుతో భారీ ఆలయ సెట్టింగ్ వేసి కనకదుర్గమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. గురువారం పెదపరిమికి విచ్చేసిన ఎమ్మెల్యేలు దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైకాపా అధినేత, మాజీ సీఎం జగన్‌కు, ఆ పార్టీ నాయకులకు దేవుడంటే భక్తి భావం లేదని ఆరోపించారు. శ్రీవారి దర్శనాల టికెట్లు అమ్ముకోవడం, తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడటమే దానికి నిదర్శనమని విమర్శించారు. కూటమి ప్రభుత్వం రావడంతో రాష్ట్రంలో శాంతియుత వాతావరణం ఏర్పడి ప్రజల్లో ఆధ్యాత్మిక పెరిగిందన్నారు. రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, నూతలపాటి రామారావు, ధనేకుల వెంకట సుబ్బారావు, భాష్యం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



తెలుగు యువత నాయకులతో ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, భాష్యం ప్రవీణ్

బస్‌షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన

తాడికొండ: తాడికొండ ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ మండలంలోని మోతడకలో నూతన బస్‌షెల్టర్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేశారు. మోతడక నుంచి నిత్యం విద్యార్థులు, వృద్ధులు గుంటూరుకు ప్రయాణిస్తుంటారు. ప్రజల అవసరాల మేరకు స్థానిక నాయకులు పంచాయితీ నిధులతో నూతన బస్‌షెల్టర్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు.

సచివాలయంలో వైద్య పరీక్షలు



వెలగపూడి సచివాలయం మహిళా ఉద్యోగులకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్ష చేస్తున్న వైద్యురాలు – ఈనాడు, అమరావతి

నిర్లక్ష్యం ఖరీదు ఏడేళ్లు

దుగ్గిరాల యార్డుకు వైభవం ఎప్పుడో?

ప్రభుత్వ కోల్డ్‌స్టోరేజీ నిర్మిస్తే రైతులకు మేలు

దుగ్గిరాల, న్యూస్‌టుడే

పసుపు వ్యాపారపరంగా రాష్ట్రంలోనే పెద్ద మార్కెట్ యార్డు దుగ్గిరాలలో ఉంది. గుంటూరు, కృష్ణాజిల్లాల నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా ఇక్కడికి సరుకు వస్తుంటుంది. అటువంటి యార్డుకు రెండు స్థలాలు ఉన్నాయి. వాటిలో భవనాలు, షెడ్లు నిర్మించారు. కొత్త యార్డు స్థలంగా చెప్పే చోట నిర్మాణం జరగక, జరిగినవి వినియోగంలో లేక దయనీయ పరిస్థితి నెలకొంది. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం యార్డుల గురించి పట్టించుకోక నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. వివరాలు పరిశీలిస్తే...



తుప్పుపడుతున్న వే బ్రిడ్జి

పునాదులకే పరిమితం

2017లో తెదేపా హయాంలో రూ.4 కోట్లతో కోల్డ్ స్టోరేజీ నిర్మాణానికి రాష్ట్రంలోని కొన్నింటితో పాటు ఇక్కడా శంకుస్థాపన చేశారు. గుత్తేదారు అంగీకార పత్రం ఇచ్చేసరికి కొంత సమయం గడిచింది. తర్వాత పనులు మొదలు పెట్టి పునాదులు తీశారు. తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రాగానే 25 శాతం కూడా జరగని పనుల జాబితాలో చేర్చి నిర్మాణాన్ని ఆపేశారు. దీంతో ఇప్పుడు అదొక చెరువులా మారింది. ఈ ఏడాది దుగ్గిరాలలో శుభ మహేశ్వరి కోల్డ్‌స్టోరేజీ దగ్ధం అయి 90 వేల బస్తాలకు పైగా పసుపు నాశనమైనా రైతు చేతికి పైసా రాలేదు. ఇప్పటికీ పరిహారం కోసం బాధిత రైతులు పోరాడుతూనే ఉన్నారు. అదే ప్రభుత్వ కోల్డ్‌స్టోరేజీ అయితే బాధ్యత ఉంటుంది. ప్రమాదాలు సంభవించినా అన్నదాతలకు న్యాయం జరుగుతుంది.



గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

నిరుపయోగంగా మారింది

యార్డులో రూ.లక్షలు ఖర్చు పెట్టి కేంద్ర ప్రభుత్వ నిధులతో వే బ్రిడ్జి ఏర్పాటు చేశారు. దీన్ని పర్యవేక్షించేందుకు ఒక గది కూడా నిర్మించారు. ఇప్పుడు ఆ కాటా నిరుపయోగంగా ఉంది. పిచ్చిచెట్ల మధ్య సగం తుప్పు పట్టి అధ్వానంగా మారింది. గది కూడా పనికిరాకుండా పోతుంది. దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. కోల్డ్ స్టోరేజీ ఉంటేనే ఇక్కడ వేబ్రిడ్జికు న్యాయం జరుగుతుంది.

కాటా విషయాన్ని బృందం పరిశీలించింది

వేబ్రిడ్జిని ఇటీవలే ప్రభుత్వం నియమించిన బృందం వచ్చి పరిశీలించింది. మరమ్మతులు చేస్తే రూ.1.5 లక్షలు వరకూ ఖర్చు అవుతుందని తేల్చారు. అన్ని చోట్లా తనిఖీ చేశారు. వాళ్లు తీసుకునే నిర్ణయం బట్టి పనులు జరుగుతాయి. కోల్డ్ స్టోరేజీ పనులు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆగాయి. అలానే దుగ్గిరాలలోనూ ఆపేశారు.

-శ్రీనివాసరావు, యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి

బిల్లుల చెల్లింపుపై ఫిర్యాదు

కొమ్మూరు (కాకుమాను), న్యూస్‌టుడే : కొమ్మూరు గ్రామ పంచాయతీలో పది రోజుల వ్యవధిలో పంచాయతీ కార్యదర్శి చేసిన లక్షలాది రూపాయల బిల్లుల చెల్లింపుపై అనుమానాలు ఉన్నాయని ఎంపీడీవో యుగకీర్తికి గ్రామస్థులు గురువారం ఫిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి బదిలీపై వెళ్లనున్నారని, ఈ విషయం తేలే వరకు ఆయన బదిలీని నిలుపుదల చేసి, విచారణ జరపాలని కోరారు. లక్షలాది రూపాయల బిల్లులు ఒక వ్యక్తి బ్యాంకు ఖాతాకు నేరుగా జమ చేశారని మీడియాకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' ఎంపీడీవోను వివరణ కోరగా.. ఫిర్యాదు అందిన మాట వాస్తవమేనని, ప్రస్తుతం ఆ పంచాయతీ కార్యదర్శిని బదిలీ చేయలేదని తెలిపారు.

తైవాన్ స్ప్రేయర్లు అందుబాటులోకి తీసుకురండి

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, ఆయా శాఖల ద్వారా అందిస్తున్న సేవలను వివరించారు. యర్రగుంట్లపాడు సర్పంచి కేశవరావు రైతు సేవా కేంద్రాల్లో ప్రస్తుతం ప్రభుత్వం రాయితీ ద్వారా అందించే తైవాన్ స్ప్రేయర్లు లేవని చెబుతున్నారు. ఇంజిన్లు అందుబాటులోకి తీసుకొస్తే రైతులకు ఉపయక్తంగా ఉంటుందని తెలిపారు. ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో పలు సమస్యలు పరిష్కరించాలని అధికారులు దృష్టికి తీసుకెళ్లారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మేడికొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని గ్రామాల్లో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. మేడికొండూరులో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో చందన మాట్లాడుతూ 73వ రాజ్యాంగ సవరణ స్థానిక స్వపరిపాలనకు మార్గం సుగమం చేసిందన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం, అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. డోకిపర్రులో జడ్పీటీసీ సభ్యుడు సిద్ధయ్య మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా గ్రామాభివృద్ధి చేసుకునేందుకు ప్రజా ప్రతినిధులు ముందుకురావాలని తెలిపారు.



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న ఇన్‌ఛార్జి సర్పంచి కుమారి, ఎంపీడీవో కె.శివపార్వతి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో కె.శివపార్వతి చెప్పారు. గురువారం మండలంలోని నడింపాలెంలో ఇన్‌ఛార్జి సర్పంచి పాలెపు కుమారి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆమె మాట్లాడారు. అనంతరం తాగునీటి చెరువు వద్ద శ్రమదానం చేసి పిచ్చి మొక్కలను తొలగించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం యనమదలలో సర్పంచి ఆదినారాయణ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు.



మేడికొండూరు మాట్లాడుతున్న ఎంపీడీవో చందన

సేవా భావం ప్రశంసనీయం



మంత్రి సవితకు చెక్కు అందిస్తున్న ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ సభ్యులు

మంగళగిరి, న్యూస్‌టుడే : పదవీ విరమణ చేశాక కూడా సమాజానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడరేషన్ సీఎం సహాయనిధికి రూ.లక్ష ఇవ్వడం ప్రశంసనీయమని మంత్రి ఎస్.సవిత అన్నారు. ఫెడరేషన్ అధ్యక్షుడు బి.వి.వి.కొండలరావు, ప్రధాన కార్యదర్శి ఎ.యెల్లారావు తదితరులు మంత్రిని గురువారం కలిసి చెక్కును అందజేశారు.

రైతులను శక్తివంతంగా చేసే సహ చట్టం

దుగ్గిరాల, న్యూస్‌టుడే : సహ చట్టం వ్యవసాయ రంగంలో రైతుల్ని, రైతు కూలీల్ని శక్తివంతంగా మారుస్తుందని తెనాలి ఏడీఏ ఉషారాణి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఏవో శిరీష అధ్యక్షతన చట్టంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏఎస్‌వో శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ ఉషారాణి

రోడ్డు భద్రతపై అవగాహన



క్విజ్ పోటీల్లో గెలిచిన విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎన్ఎస్ఎస్ అధికారి

గుంటూరు రూరల్, న్యూస్‌టుడే : చిప్స్ ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. తమ కళాశాల విద్యార్థులు మండలంలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారని ప్రిన్సిపల్ డాక్టర్ విద్యాధర తెలిపారు. చౌడవరంలోని బ్రిలియంట్ పాఠశాలలోని విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. దాసరిపాలెంలో విద్యార్థులు మానవహారంగా ఏర్పడి రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.



తుళ్లూరు: పెదపరిమిలో..



తాడేపల్లిలో పూజలు చేస్తూ..



ప్రత్తిపాడు: అంకమ్మతల్లి ఆలయంలో..



పెదనందిపాడు: గోగులమూడి పోలేరమ్మ దేవాలయంలో..

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

మంగళగిరి, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన బృందాల ఆధ్వరంలో భజనలు, పారాయణాలు పఠనం చేశారు. ఆయా దేవాలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. – న్యూస్‌టుడే, బృందం



తాడేపల్లి దివ్యక్షేత్రంలో..



దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులో..



పాత మంగళగిరి దుర్గా నగర్‌లో..



ప్రత్తిపాడు: రజక రామాలయంలో..



వట్టిచెరుకూరు: అనంతవరప్పాడులో ..



పెదనందిపాడు సోమేశ్వర స్వామి ఆలయంలో..



కాకుమాను: కొండపాటూరులో..

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? తాడికొండ ప్రధాన రహదారిలో వీధి దీపాలు వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ వాహన చోదకులు, రోడ్డు పక్కన ఉండే వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారు. - కందుల రాజు, గ్రామస్థుడు

✔ విద్యుత్తు దీపాలు తనిఖీ చేస్తాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా వెలిగేలా చూస్తాం. - శ్రీనివాసరెడ్డి, పంచాయితీ సెక్రటరీ

– న్యూస్‌టుడే, తాడికొండ

రక్షిత మంచినీటి కేంద్రం ఏర్పాటు

తాడేపల్లి, న్యూస్‌టుడే : రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహంతో దివీస్ లాబొరేటరీస్ తోడ్పాటుతో ఇప్పటంలో ఏర్పాటు చేసిన రక్షిత మంచినీటి కేంద్రాన్ని రాష్ట్ర పద్మశాలియ వెల్ఫేర్ కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య గురువారం ప్రారంభించారు. తెదేపా గ్రామ అధ్యక్షుడు శంకరశెట్టి పిచ్చయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తాడేపల్లి మండల అధ్యక్షుడు సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, కృష్ణవందన, జనసేన నాయకులు పాల్గొన్నారు.



రిబ్బను కత్తిరిస్తున్న నందం అబద్ధయ్య తదితరులు

బాధ్యతల స్వీకరణ

తుళ్లూరు, న్యూస్‌టుడే : రాయపూడిలోని విద్యుత్తు భవన్‌లో సీఆర్డీఏ సర్కిల్ ఎస్.ఈగా సుబ్రమణ్యం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సెంట్రల్ డిస్కమ్ జనరల్ మేనేజర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ప్రస్తుతం ఎస్.ఈగా పని చేస్తున్న ప్రత్తిపాటి విజయకుమార్ నరసరావుపేటకు బదిలీ అయ్యారు.

పెదనందిపాడు: పెదనందిపాడు మండల ఆర్ఐగా సాహితీ మోహన్ గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె ఫిరంగిపురం మండలం నుంచి బదిలీపై ఇక్కడకి వచ్చారు.

ఆలయానికి విరాళం

పెదనందిపాడు, న్యూస్‌టుడే : స్థానిక శిర్డీ సాయి మందిర్ అన్నపూర్ణాలయ అభివృద్ధికి పర్చూరు మండలం తిక్కరాజుపాలేనికి చెందిన కాపు శ్రీనివాసరావు గురువారం రూ. 25 వేలు విరాళం మందిర్ కమిటీ సభ్యులకు అందజేశారు.

పెదనందిపాడు, న్యూస్‌టుడే : స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూజల నిమిత్తం ఒంగోలుకు చెందిన విజయకుమార్, శ్రీలక్ష్మీ దంపతులు తరపున టి.సురేష్, లావణ్య దంపతులు రూ.50 వేలు విలువ గల వెండి పళ్లెం, గంట ఆలయ కమిటీ వారికి గురువారం అందజేశారు.

సదస్సు జయప్రదానికి పిలుపు

దుగ్గిరాల : కౌలు రైతుల పరిష్కారానికి ఈ నెల 8న విజయవాడ ఎంబీ భవన్‌లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్న శివశంకరరావు అన్నారు. గురువారం పెదపాలెం, పెదకొండూరు తదితర గ్రామాల్లో సంఘ నాయకుడు మన్నవ నాగమల్లేశ్వరరావుతో కలిసి ఆయన పర్యటించారు.

నేటి నుంచి ఉచిత శిక్షణ తరగతులు

తుళ్లూరు: నెక్కల్లులోని రమణారావు, సావిత్రమ్మ ధ్యాన ఆరోగ్య ఆశ్రమంలో శుక్రవారం నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఉచిత వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ ప్రత్యూష సుబ్బారావు గురువారం తెలిపారు.

ప్రభుత్వ ఆధీనం నుంచి తప్పించాలి

మంగళగిరి : హిందూ దేవాలయాల పర్యవేక్షణ బాధ్యత ప్రభుత్వం నుంచి తప్పించి మఠాధిపతులు, పీఠాధిపతులు, హిందూ ధార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉండేలా చూడాలని కోరుతూ మంగళగిరిలోని భారతదేశ పరిరక్షణ(సేవ్‌భారత్) ట్రస్టు ఛైర్మన్ గోలి లక్ష్మీకాంతరావు గురువారం తన భార్య దుర్గాదేవితో కలిసి ధర్నా చేశారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు

ఫిరంగిపురం గ్రామీణం: పత్తి పంటలో కాయతొలుచు, గులాబీ రంగు అంచనా వేసేందుకు ఒక్కో ఎకరాలో 4 నుంచి 6 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్, వ్యవసాయ శాస్త్రవేత్త నగేష్ తెలిపారు. మండలంలోని 113 తాళ్లూరులో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించాం

పొరపాట్లు సరిదిద్దుకుంటాం

మంగళగిరి, న్యూస్‌టుడే : గతంలో జరిగిన పొరపాట్లు సరిదిద్దుకుని మంగళగిరిలో పార్టీని బలోపేతం చేస్తామని వైకాపా ఇన్‌ఛార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు.

46 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

తాడికొండ: తాడికొండ నియోజకవర్గంలో కొందరు రేషన్ బియ్యం అక్రమ రవాణా విచ్చవిడిగా చేస్తున్నారు. తాడికొండ శివారులోని బీసీ కాలనీలో బియ్యం కొనుగోలు చేసి నిల్వ ఉంచుతున్నారు. దీనిపై తాడికొండ సివిల్ సప్లై డీటీ అనిల్ కుమార్‌కు సమాచారం అందడంతో గురువారం తనిఖీలు నిర్వహించారు. ఓ పాడుపడ్డ గృహంలో సోదా చేయగా నిల్వ ఉంచిన 46 బస్తాలు రేషన్ బియ్యం పట్టుకున్నారు. వీఆర్వో మాల్యాద్రి పర్యవేక్షణలో ఇంటి యజమానిని ఆరా తీశారు. ఆ బియ్యానికి తనకి ఏ విధమైన సంబంధం లేదని అతను తెలిపారు. కొన్నేళ్లుగా ఆ ఇంటిని వాడకుండా వదిలేశామని, పిచ్చి మొక్కలు పెరగడంతో రాకపోకలు కూడా లేవన్నారు. దీంతో అతని దగ్గర రాత పూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు.

మృతదేహానికి పంచనామా

ఫిరంగిపురం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని గుండాలపాడులో గురువారం పూడ్చిన మృతదేహం వెలికితీసి శవ పంచనామా నిర్వహించారు. ఇన్‌ఛార్జి తహసీల్దారు రాజా రమేష్ తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన నేలపాటి మణికంఠ(19) సమీపంలోని ఓ పాల డెయిరీలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. సెప్టెంబర్ 24న పగలు ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మృతి చెందాడు. మరుసటి రోజు అంత్యక్రియలు నిర్వహించారు. మణికంఠ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ అతడి తల్లి మేరి గత 30న ఫిరంగిపురం పోలీసులను ఆశ్రయించిందన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదైందన్నారు. ఈ నేపథ్యంలో పూడ్చిన మృతదేహం బయటకు తీసి పంచనామా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గుంటూరు వైద్య కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌కుమార్, సిబ్బంది, సీఐ రవీంద్రబాబు, పోలీసులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



వివరాలు సేకరిస్తున్న ప్రభుత్వ వైద్యులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు

గుంటూరు తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
94406 38515, 80085 73097

పూడికతీత

స్పందనకు వందనం

రామిరెడ్డి తోట మొదటిలైను సైడు కాల్వల్లో మురుగునీరు పారడంలేదని స్థానికులు 'మేమున్నాం.. మీకుతోడుగా'కు ద్వారా సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి పూడిక తీయించారు.

చెత్తకుప్పల తొలగింపు

వెంకట్రావుపేట మూడోలైనులో వీధుల్లో గత కొన్ని రోజులుగా చెత్త పేరుకొని ఉండటంతో స్థానికులు 'మేమున్నాం..మీకుతోడుగా' ద్వారా సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో అధికారులు చెత్త కుప్పలు తొలగించేలా చర్యలు చేపట్టారు.

- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ (గుంటూరు)

5, 6 తేదీల్లో బస్‌పాసుల జారీ నిలిపివేత

పట్నంబజారు, న్యూస్‌టుడే: విద్యార్థులకు జారీ చేసే బస్‌పాసుల వెబ్‌సైట్‌ను ఆధునికీకరిస్తున్న క్రమంలో ఈనెల 5, 6 తేదీల్లో పాసుల జారీ నిలిపివేస్తున్నట్లు గుంటూరు-1 డిపో మేనేజర్ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న నుంచి బస్‌పాసులు యథావిధిగా కౌంటర్‌లో జారీ చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు సహకరించాలని కోరారు.

సమ్మోహనంగా సాగిన సంకీర్తన గానం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై గురువారం రాత్రి నాగార్జున సాంస్కృతిక కేంద్రం, తితిదే అన్నమయ్య ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనల గానం జరిగింది. తితిదే అన్నమాచార్య ప్రాజెక్టు గాయకుడు గురజాడ మధుసూదనరావు అన్నమయ్య రచించిన కీర్తనలు గానం చేసి అలరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, నాగార్జున సాంస్కృతిక కేంద్రం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణ, జె.రామమోహనరావు తదితరులు పాల్గొన్నారు.


పాతగుంటూరు కొత్తరామువారి గుడిలో.. బాలాత్రిపురసుందరీదేవిగా..


పొన్నూరురోడ్డు కనకదుర్గ అమ్మవారి ఆలయంలో..


గంటలమ్మచెట్టువీధి: వాసవీ కన్యకా పరమేశ్వరికి గజలక్ష్మీదేవి అలంకరణ


ఏటుకూరురోడ్డులోని అభయాంజనేయస్వామి ఆలయంలో..


లాలాపేట వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవి


కొత్తపేట శివాలయంలో గాయత్రీదేవి

అపురూపం.. అమ్మ దర్శనం

ఘనంగా దసరా మహోత్సవాలు

గుంటూరు తూర్పు నియోజకవర్గ వ్యాప్తంగా గురువారం దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు కనుల పండువగా ప్రారంభమయ్యాయి. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఏటుకూరురోడ్డులోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అమ్మవారికి పూజలు జరిపారు. గంటలమ్మచెట్టువీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వనదేవి అలంకరణ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చండీ హోమాలు నిర్వహించారు. మొదటి రోజు భక్తులు ఉత్సాహంగా అమ్మవారిని దర్శించుకున్నారు.

- న్యూస్‌టుడే, పట్నంబజారు, నెహ్రూనగర్, నగరపాలకసంస్థ(గుంటూరు)



మోతీలాల్‌నగర్‌లో బాలా త్రిపుర సుందరీదేవిగా



ప్రభుత్వ పాఠశాల వద్ద..


నెహ్రూనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయంలో..


బుచ్చయ్యతోటలో బాలాత్రిపుర సుందరీదేవి


పరమయ్యకుంట అమ్మవారి ఆలయంలో..


ఏటుకూరురోడ్డులోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్ తదితరులు



ఆలయంలోకి వెళ్లే దారిలో అరణ్యం తరహాలో సెట్టింగ్..


చినమహాలక్ష్మమ్మ ఆలయం వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు


మారుతీనగర్ యాపిల్ పాఠశాలలో..

సంఘాల సేవానిరతి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం, అన్న క్యాంటీన్ల నిర్వహణకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ సమక్షంలో వివిధ సంస్థలకు చెందిన వారు విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కుల్ని విజయవాడ వరద బాధితులకు రూ.2.60 లక్షలు, అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.లక్ష చంద్రబాబుకు ఇచ్చారు. ఇందులో ఆర్‌ఎంపీ డాక్టర్ల సంఘం నాయకులు, పెరల్స్, చలమయ్య పాఠశాల నిర్వాహకులు ఉన్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కును అందజేసిన మహమ్మద్ నసీర్, ఆర్‌ఎంపీ డాక్టర్ల సంఘం నాయకులు

చంద్రబాబు దృష్టికి నందివెలుగు రైల్వే బ్రిడ్జి పనులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ అసమర్థత వల్ల అసంపూర్తిగా నిలిచిపోయిన నందివెలుగు రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయంలో గురువారం ఆయన ముఖ్యమంత్రిని కలిసి వివరించారు. ఈ వంతెనకు రూ.28 కోట్లు మంజూరైనప్పటికీ రూ.10 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయని, గత ప్రభుత్వంలో ఆగిపోయిన పనులు సంగతి పట్టించుకోలేదన్నారు. రైల్వే నుంచి రావాల్సిన రూ.18 కోట్ల నిధుల్ని మంజూరు చేయించి పనుల్ని త్వరితగతిని పూర్తి చేయించాలని కోరారు. దీనికి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు.

జీజీహెచ్‌లో పోస్టింగ్‌కు తీవ్ర పోటీ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలో సీనియర్ ఫార్మసీ సూపర్‌వైజర్ పోస్టు కోసం ఇద్దరు తీవ్రంగా పోటీ పడ్డారు. ఇద్దరిలో ఎవరికి ఈ పోస్టు దక్కుతుందోనని ఎదురుచూశారు. మరో వైపు ఆర్డీ సెలవులో ఉన్నప్పటికీ కార్యాలయానికి పిలిపించి ఉత్తర్వులు ఇచ్చేలా చూడగలిగారు. జీజీహెచ్‌లో సీనియర్ ఫార్మసీ అధికారి పోస్టు సెప్టెంబరు 30న ఖాళీ అవుతుందని తెలిసినా ఫార్మసీ అధికారులకు పదోన్నతి కౌన్సెలింగ్ గతనెల 19న ఏర్పాటు చేశారు. మొత్తం ఆరుగురికి పదోన్నతిచ్చారు. ఇందులో ఏపీఎస్పీ బెటాలియన్‌లో పని చేస్తున్న కవితను ఒంగోలుకు మార్చారు. 15 రోజుల్లో అక్కడ చేరాలి. ఈనెల 3వ తేదీ చివరి గడువు. దీంతో చివరిరోజు పట్టుబట్టి ఆ ఉత్తర్వులను రద్దు చేయించుకుని గుంటూరు జీజీహెచ్‌కి మార్పించుకున్నారు.

నాణ్యమైన గృహోపకరణాలు అందించడమే లక్ష్యం

అమరావతి, న్యూస్‌టుడే: ప్రముఖ ఎలక్ట్రానిక్ గృహోపకరణాల సంస్థ విజయ్ డిజిటల్స్ షోరూమ్ అమరావతిలో గురువారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరై ప్రారంభించారు. సంస్థ ఎండీ జువ్వాది రాహుల్ మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలతో నూతన షోరూమ్‌ను ప్రారంభించామన్నారు. వినియోగదారులకు నాణ్యమైన గృహోపకరణాలు అందించడమే తమ సంస్థ లక్ష్యం అన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయశ్రీ, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

అందుబాటు ధరల్లో వస్త్ర శ్రేణి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: బ్రాడీపేట 4/2లోని వస్త్ర సంస్థ 'శ్రీవిద్యా' ఉమెన్ ఫ్యాషన్ షోరూంలో నవరాత్రుల సందర్భంగా అక్టోబరు 12 వరకు ఆకర్షణీయమైన కలెక్షన్స్ అందుబాటు ధరల్లో లభిస్తాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఓం ప్రకాష్ తెలిపారు. కాంచీవరం పట్టు, డిజైనరీ శారీస్, టస్సర్, బెనారస్, అన్‌స్టిచ్డ్ సూట్స్, సల్వార్స్, కుర్తీస్ సహా అనేక రకాలు నూతన డిజైన్లలో అందుబాటులో ఉన్నాయన్నారు.


బ్రాడీపేటలోని శ్రీవిద్యా వస్త్రాలయం ఫెస్టివల్ సేల్ ఆఫర్స్‌ను తిలకిస్తున్న మహిళలు


పాత వాహనం మార్చుకోవచ్చు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: విజయదశమి, దీపావళి వేడుకల సందర్భంగా సంతోష్ హోండాలో వాహనం కొనుగోలు చేసే వినియోగదారులకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తున్నట్లు జనరల్ మేనేజర్ సుబ్బారెడ్డి తెలిపారు. హోండా యాక్టివా కొనుగోలు చేసిన వారికి రూ.11,299 విలువ చేసే బహుమతులు అందజేస్తున్నామన్నారు. అతి తక్కువ వడ్డీ, తక్కువ డౌన్ పేమెంట్ సరళమైన ఈఎంఐ సదుపాయాలతో అందిస్తున్నామన్నారు. డోర్ డెలివరీతో పాటు పాత వాహనం మార్పిడి చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు.


యాక్టివా వాహనాన్ని కొనుగోలు చేసిన శ్రావణికి బహుమతులు అందజేస్తున్న దుర్గాభవాని

వరద బాధితులకు సాయం

పట్నంబజారు, న్యూస్‌టుడే: ఆపదలో ఉన్న వారిని ఆదుకొనేందుకు ఆవోపా (ఆర్యవైశ్య అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్) ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని ఆవోపా నగర అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం అన్నారు. పట్నంబజారులోని సంస్థ కార్యాలయంలో గురువారం విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.2,56,546 చెక్కును ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబుకు అందజేశారు. డాక్టర్ రాంకుమార్, ఆవోపా కార్యదర్శి రాధాకృష్ణయ్య, ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


చెక్కును ఆవోపా రాష్ట్ర అధ్యక్షుడు తడవర్తి రాంబాబుకు అందజేస్తున్న బ్రహ్మం


వాహనదారునితో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్


వాహనపత్రాలు చూపమని అడుగుతున్న డీఎస్పీ సుబ్బారావు, సీఐ వెంకన్నచౌదరి


డ్రైవింగ్ లైసెన్సు పరిశీలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నగరంలో అర్ధరాత్రి పోలీసు నాకాబందీ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: నగరంలో గురువారం అర్ధరాత్రి పోలీసులు నాకాబందీ నిర్వహించారు. నంబర్‌ప్లేట్‌లేని వాహనాలతో సంచరించడం, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడటం, మద్యం తాగి వాహనాలు నడపటం, రాత్రి వేళల్లో దొంగతనాలు, దోపిడీలకు పాల్పడటం వంటి నేరాలు అరికట్టాలనే ఉద్దేశంతో ఎస్పీ సతీష్‌కుమార్ రాత్రివేళల్లో ఆకస్మికంగా వాహనాల తనిఖీకి ఆదేశించారు. నగరంలోని నెహ్రూనగర్, లాలాపేట, కొత్తపేట, పాతగుంటూరు, నల్లచెరువు తదితర ప్రధాన కూడళ్లల్లో వంద మంది పోలీసులు నాకాబందీలో పాల్గొన్నారు. సరైన పత్రాల్లేని, మద్యం తాగి నడుపుతున్నవారి వాహనాలను జప్తు చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ స్వయంగా ఆయా ప్రాంతాలలో పర్యటించి తనిఖీ తీరును పరిశీలించారు. నేరాలకట్టడికి ముందస్తు చర్యల్లో భాగంగా నాకాబందీ చేపట్టామని ఎస్పీ తెలిపారు. డీఎస్పీలు సుబ్బారావు, అజీజ్, జయరాంప్రసాద్, శివాజీరాజు, రమేష్, సీఐ వెంకన్నచౌదరి, అశోక్, శివప్రసాద్, వీరయ్య, శింగయ్య, సోమయ్య, వీరనాయక్, శ్రీనివాసరావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ముగిసిన చేతిరాత శిక్షణ

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: ఏపీ కాలిగ్రఫీ టీం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఉప్పల రామ్మోహన్‌రావు ఆధ్వర్యంలో 2 రోజులపాటు నిర్వహించిన ఉచిత చేతిరాత (కాలిగ్రఫీ) శిక్షణ గురువారం ముగిసింది. స్తంభాలగరువు చేబ్రోలు మహలక్ష్మ, పుల్లయ్య నగరపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ శిక్షణ వివిధ జిల్లాల నుంచి 30 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రాఫాలజిస్ట్ మస్తాన రామారావు మాట్లాడుతూ.. చేతిరాత అధ్యయన శాస్త్రం గురించి వివరించారు. వ్యక్తులు అక్షరాలను రాసే తీరును బట్టి వారి మనస్తత్వాన్ని 70- 80 శాతం మేర అంచనా వేయవచ్చని తెలిపారు. శిక్షణకు సహకరించిన రెడ్‌క్రాస్ సంస్థ ఉపాధ్యక్షులు రామచంద్రరాజును సత్కరించారు.


ఉపాధ్యాయురాలికి నోటు పుస్తకాలు అందజేస్తున్న రామచంద్రరాజు, పక్కన శిక్షణ నిర్వాహకులు రామ్మోహన్‌రావు

అధికారులు, గుత్తేదారుల సమన్వయంతోనే నగరాభివృద్ధి

నగరపాలకసంస్థ(గుంటూరు), న్యూస్‌టుడే: నగరంలో అభివృద్ధి పనులకు టెండర్లు దక్కించుకున్న గుత్తేదారులు వెంటనే పనులు ప్రారంభించాలని కమిషనర్ పి.శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కౌన్సిల్ సమావేశంలో గుత్తేదారులు, ఇంజినీరింగ్ అధికారులతో అభివృద్ధి పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలు, బిల్లుల చెల్లింపులు, గుత్తేదారు సమస్యలపై సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతి పనిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాతే బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు. బిల్లులను కూడా వర్క్ సీనియారిటి మేరకు చేస్తామని, గుత్తేదారులకు అత్యవసర పరిస్థితులు తమ దృష్టికి తీసుకువస్తే చెల్లింపులు వేగంగా జరిగేలా చూస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసే అమృత్, ఎన్.క్యాప్, 15వ ఆర్థిక సంవత్సరం పనులు యుద్ధ ప్రాతిపదికన చేయాలని ఆదేశించారు. ఇసుక ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేస్తే వెంటనే అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. అధికారులు, గుత్తేదారులు సమన్వయంతో పని చేస్తే నగరాభివృద్ధి వేగవంతం అవుతోందన్నారు. ఈఈలు సుందర్రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, అకౌంటెంట్ రవికిరణ్‌రెడ్డి, హెచ్‌డీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

మిర్చి వ్యాపారిపై దాడి: నగదు అపహరణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మిర్చి వ్యాపారిపై దాడిచేసి దోపిడీకి పాల్పడిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం... చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన బాషా గుంటూరు నుంచి మిర్చి కొనుగోలు చేసి తీసుకెళ్లి అక్కడ అమ్ముకుంటారు. తన ఊరు నుంచి ఈ నెల 2వ అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో గుంటూరుకు చేరుకున్నారు. మిర్చియార్డుకు వెళ్లడానికి పల్నాడు బస్టాండ్ వద్ద ఆటో కోసం వేచి ఉండగా. అక్కడకు ఓ ఆటో వచ్చింది. అందులోని ఇద్దరు వ్యక్తులు తాము మిర్చియార్డుకు వెళుతున్నామని చెప్పి ఆయన్ని ఎక్కించుకున్నారు. చుట్టుగుంట వద్ద నిర్మానుష్య ప్రాంతంలో ఆటో ఆపి బాషాను కొట్టి బెదిరించి అతని వద్ద ఉన్న రూ.9,600 నగదు, సెల్‌ఫోన్ చోరీ చేశారు. అక్కడ నుంచి ఆయన నడుచుకుంటూ వచ్చి గురువారం వేకువజామున నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్థానిక సంస్థల ప్రక్షాళనతో గ్రామీణాభివృద్ధి

జిల్లాపరిషత్తు(గుంటూరు): రాష్ట్రంలో స్థానిక సంస్థలను ప్రక్షాళన చేయడం ద్వారా గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లాపరిషత్తు ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, వార్షిక కార్యాచరణ ప్రణాళికపై మూడు రోజుల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభించారు. క్రిస్టినా మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా అనుభవమున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులను జిల్లాల్లో నియమించి పరిపాలనను ప్రక్షాళన చేశారన్నారు. జడ్పీ సీఈవో జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో కృష్ణ మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు, డీఎల్‌పీవోలు పాల్గొన్నారు.

ఇబ్బందులు తొలగించండి

నెహ్రూనగర్: మోతీలాల్‌నగర్ వాసులకు మురుగునీటి ఇబ్బందులు తొలగించాలని 56వ డివిజన్ కార్పొరేటర్ అయిశెట్టి కనకదుర్గ కోరారు. ఈ మేరకు గురువారం జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందించారు. ఆమె మాట్లాడుతూ.. చిన్నపాటి వర్షానికే మోతీలాల్‌నగర్‌లోని ఇళ్లల్లోకి నీరు చేరుతోందని తెలిపారు. అలాంటిది కొత్తగా డొంకరోడ్డు నుంచి బుచ్చయ్యతోట మీదుగ పెద్దగొయ్యి తీసి మురుగుకాలువ నిర్మాణం చేస్తున్నారని విమర్శించారు. ఆ మురుగునీటిని నెహ్రూనగర్ వద్ద కలిపితే మోతీలాల్‌నగర్‌వాసులకు మరింత ఇబ్బందిగా ఉంటుందన్నారు. కాబట్టి నెహ్రూనగర్ రైల్వేగేటు నుంచి మణిపురం బ్రిడ్జి వరకు కాలువకు ఇరువైపులా గోడలు నిర్మించాలని కోరారు. జనసేన నాయకులు శ్రీనివాసరావు ఉన్నారు.

అదుపు తప్పి.. డివైడర్ డ్రెయిన్‌పైకి దూసుకెళ్లిన బస్సు

అదృష్టవశాత్తు తప్పిన ప్రమాదం

పెదకాకాని, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు అదుపు తప్పి డివైడర్‌పై దూసుకెళ్లిన ఘటన గురువారం నంబూరులో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గుంటూరు-2 డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (నాన్ స్టాప్) విజయవాడ నుంచి 35 మంది ప్రయాణికులతో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరింది. కంతేరు అడ్డరోడ్డు వద్ద జాతీయ రహదారి పైవంతెన నుంచి కిందకు వేగంగా దిగుతోంది. వృద్ధాశ్రమం వద్దకు వచ్చే సరికి జాతీయ రహదారి కుడి వైపు ఉన్న బస్సు ఒక్కసారిగా అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్ డ్రెయిన్ పైకి దూసుకెళ్లింది. డ్రెయిన్‌లో బస్సు టైర్లు ఇరుక్కుపోవడంతో సుమారు 150 అడుగుల దూరం వరకు దూసుకెళ్లి ఆగిపోయింది. అదృష్టవశాత్తు బస్సులోని ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.


నంబూరు వృద్ధాశ్రమం ఎదుట..

ఆర్టీసీ బస్సు ఢీ కొని మహిళ మృతి

సకాలంలో సిబ్బంది స్పందించలేదని కుటుంబ సభ్యుల ఆవేదన

పట్నంబజారు, న్యూస్‌టుడే: అతి వేగంగా ఆర్టీసీ బస్సు ఢీ కొట్టిన సంఘటనలో తీవ్ర గాయాల పాలైన మహిళ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన ఇది. ట్రాఫిక్ పోలీసుల కథనం ప్రకారం.. గత నెల 27వ తేదీ ఉదయం సాంబశివపేట 3వ లైనుకు చెందిన చెన్నం శివకుమారి (59) కూరగాయలు కొనేందుకు హిందూ కాలేజీ సెంటర్‌కు వచ్చి రోడ్డు దాటుతుండగా.. చిలకలూరిపేట నుంచి గుంటూరు బస్టాండుకు వస్తున్న ఆర్టీసీ బస్సు అతి వేగంగా ఆమెను ఢీ కొట్టింది. ఆమె రెండు కాళ్లపై బస్సు టైరు ఎక్కడంతో తీవ్ర రక్తస్రావంఅవ్వడంతో అక్కడే పడిపోయారు. డ్రైవరు ఉయ్యాల రామారావు బస్సుతో సహా అక్కడి నుంచి ఉడాయించి బస్టాండు సెంటర్‌లోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి బస్సు అక్కడ ఆపి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు. హిందూ కాలేజీ విద్యార్థులు గమనించి బ్యాగ్‌లో నుంచి సెల్‌ఫోన్‌ను తీసి ఆమె కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ట్రాఫిక్ పోలీసులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె ఒళ్లు అంతా ఇన్‌ఫెక్షన్ సోకింది. పరిస్థితి విషమించటంతో ఆమెను కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గురువారం శివకుమారి మృతి చెందారు. తూర్పు విభాగపు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆర్టీసీ సిబ్బంది సకాలంలో స్పందించి తమ తల్లి శివకుమారిని సకాలంలో ఆసుపత్రిలో చేర్పించి ఉంటే ప్రాణప్రాయం నుంచి బయటపడేవరని కుమారుడు మల్లికార్జునరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే తల్లి మృతి చెందినట్లు ఆయన విలేకర్ల ఎదుట విలపించారు.


శివకుమారి (పాత చిత్రం)

మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

పట్నంబజారు, న్యూస్‌టుడే: రోడ్డుపై వెళ్తున్న మహిళ నుంచి యువకుడు బంగారపు గొలుసు లాక్కోని పరారైన సంఘటన ఇది. పాతగుంటూరు పోలీసుల కథనం ప్రకారం.. బూరెలవారివీధికి చెందిన గుడివాడ ద్రౌపది గురువారం ఉదయం స్టేడియం వైపు నుంచి ఇంటికి వెళుతున్నారు. ఇదే అదనుగా గుర్తు తెలియని యువకుడు ద్విచక్రవాహనంపై వెనుకగా వచ్చి ఆమె మెడలోని 44 గ్రాముల బంగారపు గొలుసు లాక్కోని పరారయ్యాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాత గుంటూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు పశ్చిమ

జీజీహెచ్‌లో పోస్టింగ్‌కు తీవ్ర పోటీ

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రిలో సీనియర్ ఫార్మసీ సూపర్‌వైజర్ పోస్టు కోసం ఇద్దరు తీవ్రంగా పోటీ పడ్డారు. ఇద్దరిలో ఎవరికి ఈ పోస్టు దక్కుతుందోనని ఎదురుచూశారు. మరోవైపు ఆర్డీ సెలవులో ఉన్నప్పటికీ కార్యాలయానికి పిలిపించి ఉత్తర్వులు ఇచ్చేలా చూడగలిగారు. జీజీహెచ్‌లో సీనియర్ ఫార్మసీ అధికారి పోస్టు సెప్టెంబరు 30న ఖాళీ అవుతుందని తెలిసినా ఫార్మసీ అధికారులకు పదోన్నతి కౌన్సెలింగ్ గతనెల 19న ఏర్పాటు చేశారు. మొత్తం ఆరుగురికి పదోన్నతిచ్చారు. ఇందులో ఏపీఎస్పీ బెటాలియన్‌లో పని చేస్తున్న కవితను ఒంగోలుకు మార్చారు. 15 రోజుల్లో అక్కడ చేరాలి. ఈనెల 3వ తేదీ చివరి గడువు. దీంతో చివరిరోజు పట్టుబట్టి ఆ ఉత్తర్వులను రద్దు చేయించుకుని గుంటూరు జీజీహెచ్‌కి మార్పించుకున్నారు. పదోన్నతుల జాబితాలో ఏడో పేరు ఉన్న కోటేశ్వరరావుకు జీజీహెచ్ వస్తుందని ఎదురుచూడగా పదోన్నతిచ్చి ఒంగోలుకు మార్చారు.

స్పందనకు వందనం

కాలువలో పూడికతీత: నగరంలోని కంకరగుంట బ్రిడ్జి కింద ఉన్న డ్రెయిన్‌లో చెత్త పేరుకుపోయి మురుగు కదలడంలేదు. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా జీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సోమశేఖర్‌కు తెలిపాం. ఆయన 83 సచివాలయ శానిటరీ కార్యదర్శి సంజయ్ నాయక్‌తో సిబ్బందిని పంపించి పూడికను తొలగింపజేశారు.

లీకులు అరికట్టారు: ఏటీ అగ్రహారం 13వ లైన్ దగ్గర మంచి నీరు సరిగా రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా ఏఈ నాగవేణి దృష్టికి తీసుకెళ్లాం. ఆమె మేస్త్రి కుమార్‌తో సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, ఏటీ అగ్రహారం**

6న మెగా ఉద్యోగ మేళా

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పశ్చిమ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత కోసం ఈ నెల 6న మెగా జాబ్ ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో ఆమె విలేకర్లతో మాట్లాడారు. లక్ష్మీపురం ప్రధాన రహదారిలోని పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. 30 సంస్థలు తరలి వస్తున్నాయన్నారు. నిరుద్యోగులు తమ పేర్లను క్యూఆర్ కోడ్ ద్వారా, శ్రీనివాసరావుపేట మెయిన్‌రోడ్డులోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. పదో తరగతి వరకు చదివిన వారు మొదలు పీజీ చేసిన వారందరూ అర్హులేనని తెలిపారు. ప్రవేశ రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని లేదన్నారు. టెక్ మహేంద్ర, హెటిరో ల్యాబ్స్, ఎంఆర్‌జి టైర్స్, అమర్‌రాజా బ్యాటరీస్, యాక్సిస్ బ్యాంక్, ఈసీపీఎల్ తదితర సంస్థలు పాల్గొంటాయని తెలిపారు.

స్థానిక సంస్థల ప్రక్షాళనతో గ్రామీణాభివృద్ధి

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: రాష్ట్రంలో స్థానిక సంస్థలను ప్రక్షాళన చేయడం ద్వారా గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లాపరిషత్తు ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అన్నారు. జడ్పీ సమావేశ మందిరంలో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్, వార్షిక కార్యాచరణ ప్రణాళికపై మూడు రోజుల శిక్షణ తరగతులు గురువారం ప్రారంభించారు. క్రిస్టినా మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఉద్యోగుల బదిలీల్లో భాగంగా అనుభవమున్న పంచాయతీరాజ్ శాఖ అధికారులను జిల్లాల్లో నియమించి పరిపాలనను ప్రక్షాళన చేశారన్నారు. జిల్లాకు బదిలీపై వచ్చిన ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు గ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులను భాగస్వామ్యంతో చేయాలని వివరించారు. జడ్పీ సీఈవో జ్యోతిబసు, డిప్యూటీ సీఈవో కృష్ణ మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీవోలు, ఈవోఆర్‌డీలు, డీఎల్‌పీవోలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

వినియోగదారులకు నాణ్యమైన గృహోపకరణాలు

అమరావతి, న్యూస్‌టుడే: ప్రముఖ ఎలక్ట్రానిక్ గృహోపకరణాల సంస్థ విజయ్ డిజిటల్స్ షోరూమ్ అమరావతిలో గురువారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ హాజరై ప్రారంభించారు. సంస్థ ఎండీ జువ్వాది రాహుల్ మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలతో నూతన షోరూమ్‌ను ప్రారంభించామన్నారు. వినియోగదారులకు నాణ్యమైన గృహోపకరణాలు అందించడమే తమ సంస్థ లక్ష్యం అన్నారు. ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జయశ్రీ, గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

నగరంలో అర్ధరాత్రి పోలీసు నాకాబందీ

గుంటూరు నేరవార్తలు: నగరంలో గురువారం అర్ధరాత్రి పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఎస్పీ సతీష్‌కుమార్ రాత్రివేళల్లో ఆకస్మికంగా వాహనాల తనిఖీకి ఆదేశించారు. నగరంలోని నెహ్రూనగర్, లాలాపేట, కొత్తపేట, పాతగుంటూరు, నల్లచెరువు తదితర ప్రధాన కూడళ్లల్లో వంద మంది పోలీసులు నాకాబందీలో పాల్గొన్నారు. సరైన పత్రాల్లేని, మద్యం తాగి నడుపుతున్నవారి వాహనాలను జప్తు చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆయా ప్రాంతాలలో పర్యటించి తనిఖీ తీరు పరిశీలించారు.

ఉచిత శిక్షణ.. ఉపాధికి ఆలంబన

ట్యాలీ, ఏసీ-రిఫ్రిజిరేటర్ అంశాల్లో..

యూనియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ సంస్థ అండ

మారుతీనగర్, న్యూస్‌టుడే:

గుంటూరు కొత్తపేటలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ అందిస్తున్న పలు కోర్సులు నిరుద్యోగ యువతకు వరంగా మారుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గ్రామీణ యువతకు ఉపాధే లక్ష్యంగా ఉచిత శిక్షణను ఈ సంస్థ అందించడంతో పాటు భోజనం, వసతి, రానుపోను ఖర్చులు కూడా అందిస్తోంది. ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు ట్యాలీలో జి.గోపాలకృష్ణ, ఏసీ-రిఫ్రిజిరేటర్‌లో ఉదయ్‌చంద్రరావులు శిక్షణ ఇచ్చారు. తరగతి గది శిక్షణతో పాటు సంబంధిత విభాగాలకు చెందిన సంస్థలను దర్శించడం ద్వారా ప్రత్యక్ష జ్ఞానాన్ని పొందడంతో స్వయం ఉపాధి పొందగలమనే నమ్మకం వచ్చిందంటున్న యువత గురించి తెలుసుకుందాం.



ఏసీ, రిఫ్రిజిరేటర్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

ప్రాథమిక అంశాలపై పట్టు: మోపర్తి ప్రవల్లిక, వెంగళాయపాలెం



ఇంటర్ పూర్తి చేసి డిగ్రీ రెండేళ్ల తర్వాత కుటుంబ కారణాలతో చదువు మానేయాల్సి వచ్చింది. ఇంతకుముందు కంప్యూటర్‌లో ప్రాథమిక పరిజ్ఞానం కూడా లేదు. ఇక్కడ ఎంఎస్ వర్డ్, ఎక్సెల్ నేర్చుకున్నాను. వోచర్స్ సేల్స్, అమ్మడం, కొనడం, చిట్టాపద్దులు, జీఎస్‌టీ నేర్చుకున్నాను. వీటిని కంప్యూటర్‌లో ఎలా నమోదు చేస్తామో తెలుసుకున్నాను. ప్రాథమిక అంశాలపై పట్టు సాధించాను. అకౌంటెంట్ ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యం సాధించాను..

రాత్రి పూట పునశ్చరణ..: నీలి వెంకట శివమణి, నరసరావుపేట, ఇసప్పాలెం



నెల రోజుల పాటు సంస్థ వసతి గృహంలో ఉండి ట్యాలీ నేర్చుకున్నాను. స్నేహితుడి ద్వారా శిక్షణ విషయం తెలుసుకొని వచ్చాను. జీఎస్‌టీ, వ్యాట్, పే రోల్, బడ్జెట్ అంశాలపై అవగాహన ఏర్పడింది. డిగ్రీలో బైపీసీ చదివాను. అకౌంట్స్‌పై అవగాహన లేకపోయినా శిక్షకులు చక్కగా వివరించారు. భోజనం కూడా బాగుంది. ఇలాంటి కోర్సును ఉచితంగా నేర్చుకోవడం నిరుద్యోగ యువతకు చక్కని అవకాశం. వసతి గృహంలో ఉండి రాత్రి పూట కంప్యూటర్‌పై ప్రాక్టీస్ చేయడంతో ఇంకా ఎక్కువ పరిజ్ఞానం పొందాను.

నైపుణ్యం సంపాదించా: అబ్దుల్ రహీం, కర్లపాలెం




డిగ్రీ పూర్తి చేసి స్వగ్రామంలో చిన్న వ్యాపారం చేసుకుంటున్నాను. కుటుంబ ఖర్చులు ఎక్కువ కావడంతో ఉపాధి కోసం విజయవాడ వెళ్లాలని నిర్ణయించుకున్న నేపథ్యంలో సంస్థ గురించి ప్రకటన చూసి ఏసీ, రిఫ్రిజిరేటర్ శిక్షణకు వచ్చాను. ఏసీ, రిఫ్రిజిరేటర్లలో కంప్రెషర్ పనిచేసే తీరు గురించి తెలుసుకున్నాను. కాయిల్స్ సెన్సార్లు, ఫ్యాన్ మోటర్లు, ఇన్వర్టర్, నాన్ ఇన్వర్టర్ ఏసీలు, ఇండోర్, ఔట్‌డోర్ ఏసీలను ఫిట్ చేయడం నేర్చుకున్నాను. ఇప్పుడు ఉద్యోగానికి కావాల్సిన నైపుణ్యం సంపాదించాను. మెకానిక్ దగ్గర ఈ విషయాలు నేర్చుకోవాలంటే కనీసం ఏడాది పడుతుంది.

షాప్ ఏర్పాటు చేసుకుంటా..: రంజిత్ కారాని, మోరతోట, రేపల్లె



ఐటీఐలో ఫిట్టర్ చదివాను. ఏడేళ్ల పాటు వేర్వేరు ఉద్యోగాలు చేశాను. స్వయం ఉపాధి కోసం ఏదైనా కోర్సు నేర్చుకోవాలనుకుంటున్న సమయంలో పేపర్ ప్రకటన చూసి వచ్చి చేరాను. వసతి గృహంలో ఉండి శిక్షణ తీసుకున్నా. ఏసీని బిగించడం, మరమ్మతులు చేయడం, క్షేత్ర పర్యటనలో భాగంగా నిర్మాణంలో ఉన్న షాపింగ్ మాల్‌లో ఏసీ బిగించాం. ఒక్క నెలలోనే ఇవి నేర్చుకోగలిగాను. సొంతంగా షాపు పెట్టుకొని స్వయం ఉపాధి పొందగలననే నమ్మకం ఏర్పడింది.


ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి చెక్కు అందజేస్తున్న స్నేహపరిమళం నిర్వాహకులు, సభ్యులు

స్నేహ పరిమళం చేయూత

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి గుంటూరుకు చెందిన బీఆర్ సేడియం 'స్నేహ పరిమళం వాకర్స్ అసోసియేషన్' బృందం ఆర్థిక సాయం అందించారు. 134 మంది బృందం సమకూర్చిన రూ.1,75,000 చెక్కును గురువారం బృంద సభ్యులు ముఖ్యమంత్రిని ఆయన కార్యాలయంలో కలిసి అందించారు.

సంఘాల సేవానిరతి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం, అన్న క్యాంటీన్ల నిర్వహణకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ సమక్షంలో వివిధ సంస్థలకు చెందిన వారు విరాళం అందజేశారు. దీనికి సంబంధించిన చెక్కుల్ని విజయవాడ వరద బాధితులకు రూ.2.60 లక్షలు, అన్న క్యాంటీన్ల నిర్వహణకు రూ.లక్ష చంద్రబాబుకు ఇచ్చారు. ఇందులో ఆర్‌ఎంపీ డాక్టర్ల సంఘం నాయకులు, పెరల్స్, చలమయ్య పాఠశాల నిర్వాహకులు ఉన్నారు.


ముఖ్యమంత్రి చంద్రబాబుకు చెక్కును అందజేసిన మహమ్మద్ నసీర్, ఆర్ఎంపీ డాక్టర్ల సంఘం నాయకులు

చంద్రబాబు దృష్టికి నందివెలుగు రైల్వే బ్రిడ్జి పనులు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ అసమర్థత వల్ల అసంపూర్తిగా నిలిచిపోయిన నందివెలుగు రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్ని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లారు. సచివాలయంలో గురువారం ఆయన ముఖ్యమంత్రిని కలిసి వివరించారు. ఈ వంతెనకు రూ.28 కోట్లు మంజూరైనప్పటికీ రూ.10 కోట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయని, గత ప్రభుత్వంలో ఆగిపోయిన పనులు సంగతి పట్టించుకోలేదన్నారు. రైల్వే నుంచి రావాల్సిన రూ.18 కోట్ల నిధుల్ని మంజూరు చేయించి పనుల్ని త్వరితగతిని పూర్తి చేయించాలని కోరారు. దీనికి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు.

బాలాత్రిపురసుందరీ నమోస్తుతే..


చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానంలో..


బృందావన గార్డెన్స్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో బాలాత్రిపురసుందరి అలంకారం


సిద్ధార్థనగర్ కనక మహాలక్ష్మి ఆలయంలో అమ్మవారికి పూజలు


రాజ్యలక్ష్మి అలంకారం..


ఎస్వీఎన్‌కాలనీలో..


స్తంభాలగరువులో..

గుంటూరు సాంస్కృతికం, ఏటీ అగ్రహారం, పట్టాభిపురం, గోరంట్ల, న్యూస్‌టుడే: దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాలన్నిటా బాలాత్రిపురసుందరి అలంకారాన్ని రూపుదిద్ది భక్తులకు నిర్వాహకులు దర్శనం కల్పించారు. సంపత్‌నగర్ శారదాపరమేశ్వరి దేవాలయంలో ప్రత్యేకంగా వాహన సేవ చేశారు. హంసవాహినిగా అమ్మవారిని అలంకరించి పూజలు ప్రారంభించారు. సాయంత్రం ముప్పవరపు సింహాచలశాస్త్రి హరికథా గానం జరిగింది. మారుతీ నగర్ మారుతీ దేవాలయం, విద్యానగర్ సాయినాథ సన్నిధానం, చుట్టుగుంట పోలేరమ్మ తల్లి దేవస్థానం, బృందావన గార్డెన్స్ వెంకటేశ్వర స్వామి దేవాలయం తదితర ఆలయాల్లో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవిగా, రాజ్యలక్ష్మిగా, ఆదిలక్ష్మీగా తీర్చిదిద్ది పూజలు నిర్వహించారు.


పట్టాభిపురం: రామలింగేశ్వర స్వామి దేవాలయంలో..


ఏటి అగ్రహారం 12వ లైన్‌లో..


మారుతీ దేవాలయంలో జగజ్జనికి పూజలు


మల్లారెడ్డినగర్‌లో..


గోరంట్ల ఆఫీసర్స్ కాలనీలో..


సమ్మోహనంగా సాగిన సంకీర్తన గానం


గానాలాపన చేస్తున్న మధుసూదనరావు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై గురువారం రాత్రి నాగార్జున సాంస్కృతిక కేంద్రం, తితిదే అన్నమయ్య ప్రాజెక్టు సంయుక్త ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తనల గానం జరిగింది. తితిదే అన్నమాచార్య ప్రాజెక్టు గాయకుడు గురజాడ మధుసూదనరావు అన్నమయ్య రచించిన కీర్తనలు గానం చేసి అలరించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, నాగార్జున సాంస్కృతిక కేంద్రం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సూర్యనారాయణ, జె.రామమోహనరావు, పీఎస్ఎన్ మూర్తి, డాక్టర్ ఎం.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

అసమర్థుని జీవయాత్ర నవలకు విశిష్ట స్థానం

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: తెలుగు నవలా సాహిత్యంలో త్రిపురనేని గోపీచంద్ రాసిన అసమర్థుని జీవయాత్ర నవలకు ఎన్నటికీ చెరగని విశిష్ట స్థానం ఉందని నెల్లూరు జిల్లా కోవూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకుడు డాక్టర్ చుక్కా శ్యామలకుమార్ అన్నారు. స్థానిక హిందూ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో అసమర్థుని జీవయాత్ర నవల విశేషాలు, తెలుగు సాహిత్యంలో నవలా ప్రక్రియ' అనే అంశంపై అతిథి ఉపన్యాసం గురువారం జరిగింది. శ్యామలకుమార్ మాట్లాడుతూ నకలా ప్రక్రియలోని విశేషాలను, త్రిపురనేని గోపీచంద్ మానసిక విశ్లేషణలతో ఎప్పటికీ ఉత్తమ నవలగా తీర్చిదిద్దిన తీరును విశ్లేషించి చెప్పారు. ఈసందర్భంగా డిగ్రీ విద్యార్థులు, వైస్ ప్రిన్సిపల్ కాట్రపాటి దుర్గాప్రసాద్, అధ్యాపకులు ఆలూరి నటరాజకుమారి, తపతీకిరణ్ తదితరులు శ్యామలకుమార్‌ను సత్కరించారు.


శ్యామలకుమార్‌ను సత్కరిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

పాత వాహనం మార్చుకోవచ్చు


యాక్టివా వాహనం కొనుగోలుదారుకు బహుమతులు అందజేస్తున్న దుర్గాభవాని

పట్టాభిపురం, న్యూస్‌టుడే: విజయదశమి, దీపావళి వేడుకల సందర్భంగా సంతోష్ హోండాలో వాహనం కొనుగోలు చేసే వినియోగదారులకు ఆకర్షణీయమైన బహుమతులు అందజేస్తున్నట్లు జనరల్ మేనేజర్ సుబ్బారెడ్డి తెలిపారు. హోండా యాక్టివా కొనుగోలు చేసిన వారికి రూ.11,299 విలువ చేసే బహుమతులు అందజేస్తున్నామన్నారు. అతి తక్కువ వడ్డీ, తక్కువ డౌన్ పేమెంట్ సరళమైన ఈఎంఐ సదుపాయాలతో అందిస్తున్నామన్నారు. డోర్ డెలివరీతో పాటు పాత వాహనం మార్పిడి చేసుకునే అవకాశం కల్పిస్తున్నామని వివరించారు.

అందుబాటు ధరల్లో వస్త్ర శ్రేణి


బ్రాడీపేటలోని శ్రీవిద్యా వస్త్ర దుకాణంలో మహిళల సందడి

ఏటీ అగ్రహారం, న్యూస్‌టుడే: బ్రాడీపేట 4/2లోని వస్త్ర సంస్థ 'శ్రీవిద్యా' ఉమెన్ ఫ్యాషన్ షోరూంలో నవరాత్రుల సందర్భంగా అక్టోబరు 12 వరకు ఆకర్షణీయమైన కలెక్షన్స్ అందుబాటు ధరల్లో లభిస్తాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఓం ప్రకాష్ తెలిపారు. కాంచీవరం పట్టు, డిజైనరీ శారీస్, టస్సర్, బెనారస్, అన్‌స్టిచ్డ్ సూట్స్, సల్వార్స్, కుర్తీస్ సహా అనేక రకాలు నూతన డిజైన్లలో అందుబాటులో ఉన్నాయన్నారు.

కుల దూషణపై కేసు నమోదు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: విశ్రాంత అదనపు ఎస్పీని కులం పేరుతో దూషించినందుకు ఓ రియల్ ఎస్టేట్ సంస్థ నిర్వాహకుడిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. విశ్రాంత అదనపు ఎస్పీ తిరుపాల్ రాజేంద్రనగర్‌లో నివాసం ఉంటున్నారు. ఆయన విరంచి రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన నల్లపాడు సమీపంలో విల్లాను కొనుగోలు చేసేందుకు అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. రూ.37 లక్షలు వరకు చెల్లించారు. అక్కడ విల్లాకు రెరా అనుమతులు లేవు. ఇది తెలియడంతో తాను చెల్లించిన సొమ్ము ఇవ్వమని కోరారు. డబ్బు ఇవ్వకపోగా ఆయన్ని సంస్థకు చెందిన వంశీకృష్ణ.. గోవిందరావు, కఠారియా, నాగకల్యాణిలు కులం పేరుతో దూషించారు. దీంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శ్యామలనగర్‌లో చోరీ

పట్టాభిపురం, న్యూస్‌టుడే: శ్యామలనగర్‌లో చోరీ జరిగింది. రెండో లైనులోని రవీంద్రారెడ్డి మై మార్ట్ షాప్ నిర్వహిస్తున్నారు. ఆయన బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి వెళ్లిపోయారు. గురువారం ఉదయం షాపు తెరచి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. చుట్టుపక్కల వెతకగా షాపు పక్కన ఐరన్ షట్టర్ కట్ చేసి ఉంది. కౌంటర్‌లో రూ.92,500 నగదు అపహరణకు గురైనట్లు ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చి వ్యాపారిపై దాడి: నగదు అపహరణ

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మిర్చి వ్యాపారిపై దాడి చేసి దోపిడీకి పాల్పడిన ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం.. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన బాషా గుంటూరు నుంచి మిర్చి కొనుగోలు చేసి తీసుకెళ్లి అక్కడ అమ్ముకుంటారు. తన ఊరు నుంచి ఈ నెల 2వ అర్ధరాత్రి 2 గంటల ప్రాంతంలో గుంటూరుకు చేరుకున్నారు. మిర్చియార్డుకు వెళ్లడానికి పల్నాడు బస్టాండ్ వద్ద ఆటో కోసం వేచి ఉండగా. అక్కడకు ఓ ఆటో వచ్చింది. అందులోని ఇద్దరు వ్యక్తులు తాము మిర్చియార్డుకు వెళుతున్నామని చెప్పి ఆయన్ని ఎక్కించుకున్నారు. చుట్టుగుంట వద్ద నిర్మానుష్య ప్రాంతంలో ఆటో ఆపి బాషాను కొట్టి బెదిరించి అతని వద్ద ఉన్న రూ.9,600 నగదు, సెల్‌ఫోన్ చోరీ చేశారు. అక్కడ నుంచి ఆయన నడుచుకుంటూ వచ్చి గురువారం వేకువజామున నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బదిలీల ఉత్తర్వులకు నెల్లూరుకు!

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీరాజ్ శాఖలో ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులపై సంతకాలు చేయించేందుకు కొందరు ఉద్యోగులు నెల్లూరుకు బయలుదేరి వెళ్లాల్సి వస్తోంది. గత నెల సెప్టెంబరు 22వ తేదీతో బదిలీల గడువు ముగిసింది. అప్పటి జిల్లాపరిషత్తు ఇన్‌ఛార్జి సీఈవో జె.మోహన్‌రావు ఉత్తర్వులను జారీ చేశారు. కొందరు ఎంపీడీవోలు, సిబ్బందికి సంబంధించి నోట్ ఫైల్‌లో పేర్కొన్న ప్రొసీడింగ్స్‌పై సంతకాలు చేయలేదు. దాంతో వారు నూతన స్థానాల్లో విధుల్లో చేరేందుకు ఇబ్బందులు పడుతున్నారు. డిప్యూటీ సీఈవో మోహన్‌రావును శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాపరిషత్తుకు ప్రభుత్వం బదిలీ చేయడంతో ఆయన విధుల నుంచి రిలీవై నెల్లూరులో బాధ్యతలు స్వీకరించారు. సీఈవోగా జ్యోతిబసు, డిప్యూటీ సీఈవోగా కృష్ణని నియమించడంతో వారు విధుల్లో చేరారు. అయితే బదిలీల గడువు సెప్టెంబరు 22వ తేదీతో ముగియడంతో ఉత్తర్వులపై మోహన్‌రావుతోనే సంతకాలు చేయించాల్సిన పరిస్థితి నెలకొంది. దాంతో ఓ ఎంపీడీవో, జడ్పీకి చెందిన సిబ్బంది కొందరు గురువారం నెల్లూరు బయలుదేరి వెళ్లారు.


చేర్చుకోకుండా ఇబ్బందులు

జిల్లాపరిషత్తు, మండల పరిషత్తు కార్యాలయాల్లో పనిచేస్తున్న కొందరు పరిపాలన అధికారులు, మినిస్టీరియల్ ఉద్యోగులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వారిలో కొందరిని కొత్త స్థానాల్లో చేర్చుకోకుండా ఎంపీడీవోలు ఇబ్బందులు పెడుతున్నారనే విమర్శలున్నాయి. పలువురి ప్రజాప్రతినిధుల పేర్లు చెప్పి ద్వితీయ శ్రేణి నాయకులు వారిని అడ్డుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు సెప్టెంబరు 22న బదిలీ ఉత్తర్వులు జారీ చేయడంతో వారిని ఆయా కార్యాలయాల్లో విధుల నుంచి రిలీవ్ చేయగా.. కొత్తగా బదిలీపై వచ్చిన సిబ్బంది విధుల్లో చేరిపోయారు. జిల్లాలో 30 మందికి పైగా ఉద్యోగులు రెండు వారాలవుతున్నా విధుల్లో చేర్చుకోకపోవడంతో ఉండిపోయారు. తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదని సిబ్బంది వాపోతున్నారు. అధికారులు బదిలీ చేశారని.. ఇప్పుడు విధుల్లో చేర్చుకోకుంటే ఏం చేయాలని ప్రశ్నిస్తున్నారు.

త్వరలో ఇన్నర్ రింగ్‌రోడ్డు మూడో దశ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్‌రోడ్డు మూడో దశ నిర్మాణానికి సంబంధించి త్వరలో సీఆర్డీఏ అధికారులతో కూడా సమీక్షించి చర్యలు తీసుకుంటామని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో జాతీయ రహదారులతో పాటు ఇన్నర్ రింగ్‌రోడ్డు మూడో దశ విషయంపై కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి సమీక్షించామని తెలిపారు. మూడో దశ పనులకు సంబంధించి సుమారు 300 మందికి పరిహారం విషయంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. త్వరలో సీఆర్డీఏ అధికారులతో సమీక్షించి పరిహారం నిర్ణయించి పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతామని పేర్కొన్నారు. సమీక్షలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జేసీ ఎ.భార్గవ్ తేజ, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎన్‌హెచ్ఏఐ గుంటూరు, విజయవాడ ప్రాజెక్ట్ డైరెక్టర్లు పార్వతీశం, శ్రీధర్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సేవా సంస్థ ఔదార్యం



వరద బాధితుల సహాయార్థం గుంటూరుకు చెందిన సీనియర్ సిటిజన్స్ సేవా సంస్థ అధ్యక్షుడు మన్నె సుబ్బారావు ఆధ్వర్యంలో సభ్యులు.. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సమక్షంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు రూ.27.5 లక్షల చెక్కును సచివాలయంలో గురువారం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు దాసరి హనుమంతురావు, నూతలపాటి తిరుపతయ్య, కోగంటి బసవనందికేశ్వరరావు, బండ్ల దశరథ రామారావు, సోమేపల్లి రామ్‌ప్రసాద్, కుర్రా ధనుంజయరావు, నల్లపనేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, గుంటూరు(పట్టాభిపురం)

సైబర్ నేరాలపై అప్రమత్తం: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ సతీష్ కుమార్

గొడవర్రు (చేబ్రోలు),న్యూస్‌టుడే: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అన్నారు. మండలంలోని గొడవర్రు పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం రాత్రి వారధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలంతా కలిసిమెలిసి ఉంటే ఎటువంటి వివాదాలకు తావుండదన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీసులను ఆశ్రయించాలే.. తప్ప చట్టాన్ని చేతిలోకి తీసుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని కోరారు. విద్యార్థులపై కేసులు నమోదై నిరూపించితే వారి ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు విఘాతం ఏర్పడి జీవితాన్నే కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించారు. గ్రామ సర్పంచి బీరం జానకీదేవి, తెనాలి డీఎస్పీ జనార్దనరావు, పొన్నూరు గ్రామీణ సీఐ కోటేశ్వర రావు, చేబ్రోలు ఎస్సై డి.వెంకట కృష్ణ పాల్గొన్నారు.

నైపుణ్య గణనకు ప్రజలందరూ సహకరించండి




మంగళగిరిలో వివరాల సేకరణ పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

మంగళగిరి, న్యూస్‌టుడే : స్కిల్ సెన్సెస్‌లో భాగంగా గణకులు ఇళ్లకు వచ్చినప్పుడు అన్ని వివరాలు ఇచ్చేలా ప్రజలు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ నాగలక్ష్మి చెప్పారు. రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టుగా నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమాన్ని తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హాతో కలిసి ఆమె గురువారం పరిశీలించారు. కుటుంబ వివరాలు ఏ విధంగా సేకరిస్తున్నారో గమనించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ గణన ప్రారంభిస్తారని, ముందుగా మంగళగిరి నియోజకవర్గంతో పాటు సీఆర్‌డీఏ పరిధిలోని గ్రామాల్లో సేకరిస్తారన్నారు. నైపుణ్యం యాప్ ద్వారా వివరాలు సేకరించేందుకు 1049 సచివాలయ ఉద్యోగుల్ని ఎన్యూమరేటర్స్‌ను ఎంపిక చేశారన్నారు. ఆధార్ ఆధారిత ఈ గణన చేస్తారన్నారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని చూస్తున్నామని తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈడీ అనిల్‌కుమార్, జిల్లా అధికారి సంజీవ్‌కుమార్, జిల్లా ఉపాధి కల్పనాధికారి రఘు తదితరులు పాల్గొన్నారు.

మంగళకరం.. పంచహారతుల వీక్షణం

హిందూ సంప్రదాయంలో హారతికి ఎంతో ప్రాధాన్యం ఉంది. మనం చేసే పూజలు ఫలించాలంటే ఇది తప్పనిసరి. ఒకవేళ ఇవ్వకపోతే అసంపూర్ణంగా భావిస్తారు. అలాంటిది ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను స్తుతిస్తూ రుత్వికులు నిత్యం పంచహారతులు సమర్పిస్తారు. సమస్త లోకం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకుంటూ వీటిని ఇస్తారు. హారతి వలన మంగళం కలుగుతుందని భక్తుల నమ్మకం. దసరా వేడుకల్లో వివిధ రూపాల్లో ఉన్న జగన్మాత దుర్గమ్మకు వీటిని కనుల పండువగా ఇస్తారు. వీటిని తిలకించేందుకు రెండు కళ్లు సరిపోవంటే అతిశయోక్తి కాదు.

– ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే



అన్ని మంత్రాలకు మూలం ఓంకారం

సాయం సంధ్యవేళ నివేదన అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ఓంకార హారతి ఇస్తారు. అన్ని మంత్రాలకు మూలం ఓంకారం. ఓంకార రూపాన్ని దర్శించడంతో సమస్త పాపాలు తొలగిపోతాయన్నది భక్తుల విశ్వాసం.



అన్ని నక్షత్ర రాశుల వారికి..

పంచహారతుల్లో చివరిది నక్షత్ర హారతి. సకల నక్షత్ర రాశుల వారి వీక్షణార్థం ఈ హారతిని అమ్మవారికి సమర్పిస్తారు. 27 నక్షత్రాల్లో జన్మించిన వారు రాశీ ఫలాలతో సంబంధం లేకుండా వీక్షిస్తే ప్రయోజనం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం.

దీర్ఘాయువును ప్రసాదించే నాగదేవత



పంచహారతుల్లో రెండవది నాగ హారతి. దేవతా స్వరూపమైన నాగ సర్పం దీర్ఘాయువుకు పవిత్రతకు ప్రతీక. నాగ హారతిని దర్శించడం వలన సకలరోగాలు నివారించబడతాయని భక్తుల నమ్మకం. దీంతోపాటు సర్పదోషాలు తొలగిపోతాయి.



భూమండలాన్ని రక్షించే కుంభహారతి

పంచహారతుల్లో నాల్గోది కుంభ హారతి. సమస్త భూమండలాన్ని రక్షించే ఈ హారతిని తిలకించడంతో జీవ రక్షణ లభిస్తుంది. సమాజ శ్రేయస్సుకు ఉపయోగపడుతుంది. భక్తులకు అనన్యమైన పుణ్యం సిద్ధిస్తుంది.

పరమేశ్వరుని పంచముఖాలకు ప్రతిరూపం




జగన్మాత దుర్గమ్మకు ఇచ్చే మహిమాన్వితమైనది పంచహారతి. పరమేశ్వరిని పంచముఖాలకు ప్రతిరూపంగా దీన్ని భావిస్తారు. ఈ హారతిని వీక్షిస్తే భక్తులకు పంచ మహాపాతకాలు తొలగుతాయి. పంచప్రాణాలకు సాంత్వన కలుగుతుంది. దుర్గామల్లేశ్వర స్వామి వార్ల సంపూర్ణ అనుగ్రహం కలుగుతుందని భక్తుల నమ్మకం.

నేటి అలంకారం

4-10-2024, శుక్రవారం

శ్రీ గాయత్రీ దేవి



"ఓం బ్రహ్మస్వరూపిణీకాస్తాం శుద్ధ జ్యోతి స్వరూపిణీం సర్వతత్త్వమయీం వందే గాయత్రీం వేదమాతరం"

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో రెండో రోజు జగన్మాత దుర్గమ్మను వేదమాత గాయత్రీదేవిగా అలంకరిస్తారు. పంచముఖాలతో దర్శనమిచ్చే సంధ్యావందన అధిష్ఠాన దేవతగా అమ్మవారిని కొలుస్తారు. కొబ్బరిఅన్నాన్ని నివేదనగా సమర్పిస్తారు. సకల మంత్రాలకు, వేదాలకు మూలమైన దేవత గాయత్రీదేవి ప్రసిద్ధి. మహత్తర శక్తిగల జగన్మాత ఐదు ముఖాలతో వరదాభయ హస్తాలు ధరించి కమలాసనాసీనురాలిగా నేడు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

కొత్తగా 36 పోలింగ్ కేంద్రాల గుర్తింపు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ(రేషనలైజేషన్)లో భాగంగా జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 36 కొత్త పోలింగ్ కేంద్రాలను గుర్తించామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్‌లోని వీసీ హాలులో గురువారం పోలింగ్ కేంద్రాలపై ఈఆర్వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 1,500 ఓటర్లు పైబడిన పోలింగ్ బూత్‌లను కొత్త కేంద్రాలుగా ఏర్పాటు చేయాల్సి ఉందని, ఆ మేరకు పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. తాడికొండ 1, మంగళగిరి 17, ప్రత్తిపాడు 3, గుంటూరు పశ్చిమ 9, గుంటూరు తూర్పు 6 కేంద్రాలను గుర్తించామన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల తరపున కంచెర్ల శివరామయ్య(తెదేపా), బిళ్లా సునీల్(కాంగ్రెస్), సీహెచ్.వాసు(బీఎస్పీ), సేవాకుమార్(ఆప్), కృష్ణకాంత్(సీపీఎం), డీఆర్వో పి.రోజా, ఈఆర్వోలు పాల్గొన్నారు.

డిసెంబరు 11న భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు

నెహ్రూనగర్, న్యూస్‌టుడే : తిరుపతి తిరుమల దేవస్థానం (తితిదే), హిందూ ధర్మ ప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) ఆధ్వర్యంలో గీత జయంతి పురస్కరించుకొని డిసెంబరు 11వ తేదీన భగవద్గీత శ్లోక కంఠస్థ పఠన పోటీలు నిర్వహిస్తున్నట్లు తితిదే, హెచ్‌డీపీపీ ఉమ్మడి జిల్లా సమన్వయకర్త అమ్మడు తెలిపారు. స్థానిక తితిదే కల్యాణ మండపంలో గురువారం ఆమె వివరాలు తెలిపారు. భగవద్గీత 6వ అధ్యాయం ఆత్మ సంయమ యోగం (ధ్యాన) నుంచి పోటీలు ఉంటాయన్నారు. 6-7 తరగతులకు ఒక విభాగం, 8-9 తరగతులకు మరో విభాగంగా పోటీలు జరుగుతాయన్నారు. సంపూర్ణ భగవద్గీత కంఠస్థం చేసిన 18 సంవత్సరాలు లోపువారికి, 18 సంవత్సరాలు పైబడినవారికి రెండు విభాగాల వారికి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా విభాగాల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు, నగదు ఇస్తారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. ఇతర వివరాలకు సెల్ నంబర్ 9989023329 సంప్రదించాలన్నారు. సమావేశంలో సభ్యులు సుబ్బారావు, శివయ్య, ఆదినారాయణరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోగస్ సంస్థలతో జీఎస్టీ ఎగవేత

(మొదటి పేజీ తరువాయి)

ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్ రూపంలో లబ్ధి పొందుతున్నారు. ఏవేవో ఆధార్ కార్డు వివరాలను దరఖాస్తులో నమోదు చేస్తున్నారు. కొన్నిచోట్ల యజమానులకు తెలియకుండా వారి దుకాణాల్లో వ్యాపారసంస్థలు నిర్వహిస్తున్నట్లు ఆధారాలు సమర్పిస్తున్నారు. అనుమతులు జారీచేశాక వీటి కార్యకలాపాలపై వాణిజ్యపన్నుల శాఖ పర్యవేక్షణ ఉండట్లేదు. తనిఖీల సమయంలోనే కొన్ని అక్రమాలు బయటపడుతున్నాయి. సర్కిళ్ల పరిధిలో కాకుండా.. సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ ద్వారా అనుమతులు జారీకావడంతో ఎవరి పర్యవేక్షణా ఉండట్లేదు. సులభతర వాణిజ్య విధానంలో భాగంగా ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అధికారులు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. నిర్ణీత వ్యవధిలో అనుమతులు ఇవ్వకపోతే ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్ అయిపోతుంది. ఈ క్రమంలో దరఖాస్తుల్లోని వివరాల పరిశీలనకు వీలు ఉండట్లేదు. రిజిస్ట్రేషన్ జరిగాక... కొన్ని నెలల తర్వాత భారీగా ఇన్వాయిస్‌లు జారీ అయినట్లు గుర్తించాక గానీ అక్రమాలు జరిగినట్లు తెలియదు.

613 వ్యాపార సంస్థలను పరిశీలిస్తే 53 తూచ్

మలివిడత తనిఖీలలో రాష్ట్రంలో ఇటీవల వరకు 613 వ్యాపారసంస్థల లావాదేవీలు పరిశీలించగా.. 53 మనుగడలో లేవు. దాంతో 41 రిజిస్ట్రేషన్లను సస్పెండ్ చేశారు. 12 రిజిస్ట్రేషన్లను రద్దుచేశారు. సుమారు రూ.5కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ లావాదేవీలు జరగకుండా బ్లాక్ చేశారు.

అమరావతిలో సివిల్ సర్వీసెస్ శిక్షణ కేంద్రం

(మొదటి పేజీ తరువాయి)

వారిని గుర్తించి, నైపుణ్యం పెరిగేలా శిక్షణ ఇచ్చి ఆదరణ, ఇతర రాయితీ రుణాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అర్హులను ఎంపిక చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల కావడానికి ముందు నుంచే బీసీ స్టడీ సర్కిళ్లలో నిరుద్యోగ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇస్తాం' అని తెలిపారు.

తెల్లారేసరికి.. తుడిచిపెట్టేసేలా!

(మొదటి పేజీ తరువాయి)

చర్యలపై చేష్టలుడిగి చూస్తోంది.

ఒక్క రోజులో 25 సెం.మీ. వాన

24 గంటల్లో 20 సెం.మీ వర్షం కురిస్తే.. అమ్మో కుంభవృష్టి అనేవాళ్లం. ఇప్పుడు ఒక్క రోజులో 25 సెం.మీ. వర్షం అనేది సాధారణంగా తయారైంది. మారుతున్న వాతావరణ పరిస్థితులతో చాలాచోట్ల అతి, అత్యంత భారీ వర్షాలే నమోదవుతున్నాయి. గంట వ్యవధిలో 6 నుంచి 10 సెం.మీ. వర్షం కురుస్తున్న పరిస్థితులూ ఉన్నాయి. అది ఒకటి, రెండు ప్రాంతాలకే పరిమితమైతే వరద ప్రవాహం తక్కువే ఉంటుంది. కానీ వందల కిలోమీటర్ల విస్తృతిలో అత్యంత భారీగా వానలు కురుస్తుండటంతో వరదలు పోటెత్తి ఊరూ వాడా తేడా లేకుండా ముంచెత్తుతున్నాయి.

■ తెలంగాణలోని ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో.. సుమారు వంద కిలోమీటర్లకు పైగా విస్తృతిలో అత్యంత భారీ వర్షాలు కురిశాయి. ఏకంగా 30 ప్రాంతాల్లో 25 సెం.మీ నుంచి 53 సెం.మీ వర్షం కురిసింది. అదే సమయంలో పొరుగునున్న ఎన్టీఆర్ జిల్లాలోనూ కుండపోత వానలు కురిశాయి. ఫలితంగానే మునేరు, బుడమేరుకు వరద పెరిగింది.

■ మిగ్‌జాం తుపాను సమయంలో గతేడాది డిసెంబరు 2 నుంచి 5వ తేదీ ఉదయం 8.30 గంటల వరకు అంటే మూడు రోజుల్లో తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలే కురిశాయి. పెళ్లకూరు, నాయుడుపేట, బుచ్చినాయుడుకండ్రిగ, చిల్లకూరు, నెల్లూరు అర్బన్, కోట తదితర 12 మండలాల్లో 50 సెం.మీ. పైగా వర్షం కురిసింది. ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోనూ అప్పట్లో 24 గంటల్లోనే 25 సెం.మీ పైగా కురిసింది. తుపాన్లు, ద్రోణుల ప్రభావంతో అత్యంత భారీవర్షాలు కురిసే ప్రాంతాలే ఎక్కువగా ఉంటున్నాయి.



అల్లూరి సీతారామరాజు జిల్లా బంధవీధి వద్ద పొలాల్లోకి కొట్టుకొచ్చిన రాళ్లకుప్పలు, చెట్లు

ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తేనే..

విరుచుకుపడుతున్న విపత్తులను ఎదుర్కోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సంసిద్ధతా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలి. మన్యంలో అత్యంత భారీ వర్షాలతో ప్రజల జీవనమే ప్రశ్నార్థకంగా తయారవుతోంది. ఏ రాత్రి ఎటు నుంచి మట్టి, రాళ్లు, చెట్లతో కూడిన వరద ముంచెత్తుతుందో అనే భయాందోళనల మధ్య జనం బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నారు. కొండ ప్రాంతాల్లో ఎంత వర్షం కురుస్తుందో గుర్తించే పరిస్థితి లేదు. తెలుసుకునేలోగానే వరద ముంచేస్తోంది. పట్టణ, నగర ప్రాంతాల్లో కొండలపై ఇళ్లు కట్టుకున్న వారికీ వాన కురుస్తుందంటే గుండె దడే! రాష్ట్ర ప్రభుత్వం నదీ పరీవాహకాలతోపాటు.. మైదాన, కొండ ప్రాంతాల్లోనూ వర్షపాతాన్ని గుర్తించి తక్షణమే అప్రమత్తం చేసే వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. విపత్తు సమయాల్లో వారికి తక్షణ సహాయం అందించేలా చూడాలి.

మూడేళ్లలో రూ. 3,761 కోట్లు.. దేనికి ఖర్చయ్యాయో?

పెరుగుతున్న విపత్తుల నేపథ్యంలో ఆర్థిక సంఘం సూచనల మేరకు కేంద్రం రాష్ట్రాలకు ఎస్‌డీఆర్ఎఫ్ కింద నిధుల్ని కేటాయిస్తుంది. ఇందులో కేంద్రం 75%, రాష్ట్రం 25% భరిస్తాయి. 2021-22 నుంచి 2025-26 వరకు ఆంధ్రప్రదేశ్‌కు రూ.6,591 కోట్లు కేటాయించారు. 2021-22 నుంచి 2023-24 వరకు రూ.3,761 కోట్లు అందాయి. వివిధ రకాల విపత్తుల్ని ఎదుర్కొనేందుకు ఈ నిధుల్ని వినియోగించుకోవచ్చు. కానీ గత ప్రభుత్వంలో దేనికి ఖర్చు చేశారో లెక్కలూ చెప్పలేని పరిస్థితి.



అల్లూరి సీతారామరాజు జిల్లా చెల్లనిశిల్ప వద్ద నర్సీపట్నం- భద్రాచలం ప్రధాన రహదారిపై పెద్దఎత్తున విరిగిపడిన కొండచరియలు, పేరుకుపోయిన మట్టి

అమరావతి నుంచి పోర్టుకు జలమార్గం

ప్రతిపాదనపై సీఎం సానుకూలత: మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం (కోనేరుసెంటరు), న్యూస్‌టుడే: రాజధాని అమరావతి నుంచి బందరు పోర్టుకు జలమార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు గనులు, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. మచిలీపట్నంలో గురువారం ఆయన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఇన్‌లాండ్ వాటర్ వేస్ అభివృద్ధి కింద అమరావతి నుంచి నేరుగా పోర్టు వరకూ కాలవ ద్వారా రవాణా సౌకర్యం కల్పించే ప్రతిపాదనకు ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలత వ్యక్తం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న బందరు కాలవను అవసరం మేరకు అభివృద్ధి చేసి బందరు వద్ద అనుసంధాన కాలవను నిర్మిస్తే జలమార్గం సిద్ధం అవుతుందన్నారు. బుధవారం మచిలీపట్నం వచ్చిన చంద్రబాబు నగర అభివృద్ధితో పాటు, పోర్టు పనులు వేగవంతం చేసేందుకు ఆదేశాలు ఇచ్చినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. షెడ్యూల్‌లో లేకపోయినా పోర్టు పనులను సందర్శించడం ద్వారా ముఖ్యమంత్రి మచిలీపట్నం నుంచే ఆకస్మిక తనిఖీలకు నాంది పలికారన్నారు. 300 ఎకరాలకు పైగా ఆస్తులున్న ఆంధ్రా జాతీయ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుందన్నారు. స్వాతంత్రోద్యమ సమయంలో ప్రముఖులైన ముట్నూరి కృష్ణారావు, కోపల్లె హనుమంతరావు, డాక్టర్ భోగరాజు పట్టాభిసీతారామయ్యలు ప్రజా సహకారంతో కళాశాలను ఏర్పాటు చేస్తే ముంబయి నటి జత్వాని కాదంబరి కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి అక్రమంగా కళాశాల ఆస్తులు అనుభవిస్తున్నారన్నారు. ప్రజలకు చెందాల్సిన ఆస్తి అన్యాక్రాంతం అవడంపై దీర్ఘకాలంగా పోరాటం చేస్తూనే ఉన్నామని, తాజాగా చంద్రబాబు హామీతో త్వరలో ఇవి ప్రభుత్వపరం కానుందన్నారు. ఈ కళాశాలలో గ్లోబల్ కేపబిలిటీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రోల్డ్ గోల్డ్ పరిశ్రమకు సంబంధించి ఎంఎస్ఎంఈ క్లస్టర్ల ద్వారా అభివృద్ధి చేయడంతో పాటు డిజైనింగ్‌లో నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. చిరకాల వాంఛగా ఉన్న మచిలీపట్నం-రేపల్లె రైల్వేలైన్ ఏర్పాటుకు అడుగులు ముందుకు పడుతున్నాయన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, పాషా తదితరులు పాల్గొన్నారు.

వియత్నాంకు విమాన సర్వీసు నడపాలి

ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్

ఈనాడు, అమరావతి: రాష్ట్రం నుంచి వియత్నాంకు విమాన సర్వీసు నడపాలని వియట్‌జెట్ ఎయిర్ సీఈవోకు ఏపీ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ తరఫున లేఖ రాసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు ఓ ప్రకటనలో తెలిపారు. 'తృణధాన్యాలు, పప్పు దినుసులు, ఫుడ్ ప్రాసెసింగ్, రొయ్యల పెంపకం, సుగంధద్రవ్యాలు, పత్తి, ఆటో కాంపోనెంట్స్, బల్క్ ఫార్మా ఔషధాల ఉత్పత్తిలో రాష్ట్రానికి గుర్తింపు ఉంది. వాటిని దిగుమతి చేసుకొని విలువ జోడించిన తర్వాత ఇతర దేశాలకు వియత్నాం ఎగుమతి చేస్తుంది. రాష్ట్రం నుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు వియత్నాంలో మెడిసిన్, అగ్రిఫార్మింగ్‌లలో ఉన్నత విద్య అభ్యసిస్తున్నారు. చౌక పర్యాటక ప్రదేశంగా వియత్నాంకు గుర్తింపు ఉంది. విశాఖ, విజయవాడల్లో ఏదో ఒక చోట నుంచి వారంలో రెండు విమాన సర్వీసులను నేరుగా వియత్నాంకు నడిపితే వెసులుబాటుగా ఉంటుంది' అని లేఖలో పేర్కొన్నారు.

ఆప్ సి-జోన్ సమన్వయకర్తగా నేతి మహేశ్వరరావు

ఈనాడు డిజిటల్, అమరావతి: ఆమ్ ఆద్మీ పార్టీ కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల (సి-జోన్) సమన్వయకర్తగా నేతి మహేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమేశ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పోలవరం పనులపై సుదీర్ఘ సమీక్ష

- ప్రాజెక్టును సందర్శించిన సీఈఓ అతుల్ జైన్



ఎగువ కాఫర్ డ్యాం వద్ద ప్రాజెక్టు ఇన్‌ఛార్జి సీఈతో మాట్లాడుతున్న అతుల్‌జైన్

పోలవరం, న్యూస్‌టుడే: రెండ్రోజుల పర్యటనలో భాగంగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ సీఈఓ అతుల్ జైన్ ప్రాజెక్టు పనుల స్థితిగతులను గురువారం తెలుసుకున్నారు. స్పిల్‌వే, గైడ్ బండ్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, గ్యాప్-1, 2, 3లను పరిశీలించి, వివరాలు తెలుసుకున్నారు. అనంతరం క్యాంపు కార్యాలయానికి చేరుకొని ప్రాజెక్టు కుడి వైపు జరిగిన అనుబంధ పనులు, జంట సొరంగాలు, రెగ్యులేటర్లు, బండ్-1, 2లను పరిశీలించారు. జలవనరులశాఖ అధికారులు, గుత్తేదారు, వాప్కోస్ ప్రతినిధులతో సుదీర్ఘంగా సమీక్షించారు. అనంతరం రాజమహేంద్రవరం బయలుదేరి వెళ్లారు. శుక్రవారం అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలోని పునరావాస కాలనీలను సీఈఓ సందర్శించనున్నట్లు అధికారులు తెలిపారు. ఆయన వెంట పోలవరం ప్రాజెక్టు ఇన్‌ఛార్జి సీఈ కె.నరసింహమూర్తి, పీపీఏ సీఈ రాజేశ్‌కుమార్, ఈఈలు పి.సుధాకరరావు, పి.వెంకటరమణ, పలువురు డీఈలు ఉన్నారు. సీఈఓ పర్యటనను పురస్కరించుకుని కవరేజ్ కోసం వెళ్లిన మీడియాను ప్రాజెక్టు ప్రాంతంలోకి అనుమతి లేదంటూ ఎస్పీఎఫ్ పోలీసులు స్థానిక చెక్‌పోస్టు వద్ద నిలిపేశారు.